# తొలి అక్షరం

తెలుగు దిన పత్రిక

చైర్మెన్ & చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 01 సంచిక - 346 పేజీలు - 6 మంగళవారం 05 నవంబర్ 2024


## లంచంలో వాటా కోసం కొట్టుకున్న కానిస్టేబుళ్లు!

**- నెక్కొండ పోలీస్ స్టేషన్‌లో ఘటన**

**తొలి అక్షరం/నెక్కొండ, నవంబర్ 4 :** వరంగల్ జిల్లా నెక్కొండ పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు లంచం డబ్బుల కోసం ఘర్షణ పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ విషయం సోషల్ మీడియాలో సోమవారం వైరల్ అయ్యింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కొన్ని రోజుల కిందట నెక్కొండ ఎస్సై మహేందర్ సెలవుపై వెళ్లారు. ఈ నేపథ్యంలో పోలీస్‌స్టేషన్ బాధ్యతలను ఓ హెడ్‌కానిస్టేబుల్‌కు అప్పగించారు. అతడు ఓ ఫిర్యాదుదారుడి నుంచి రూ.వెయ్యి లంచం తీసుకున్నాడు. మరో హెడ్ కానిస్టేబుల్ తన వాటా అడగడంతో గొడవ జరిగింది. ఒకరిపై ఒకరు చేయిచేసుకున్నట్టు సమాచారం. ఈ ఘటన అక్టోబర్ 27న జరగ్గా, సీఐ ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించారు. వారు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సి ఉన్నది. కాగా, డ్యూటీల విషయంలో ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు ఘర్షణ పడినట్టు పోలీసులు చెప్పుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు.



# సాఫీగా ధాన్యం కొనుగోళ్లు

## అధికారులను ఆదేశించిన సిఎం రేవంత్

**తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 4:** రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల పక్రియ సాఫీగా జరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను సమర్థంగా అమలు చేసేందుకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఉమ్మడి జిల్లాకో ఐఏఎస్ను ప్రత్యేక అధికారిగా నియమించింది. రైతులకు ఇబ్బంది తలెత్తకుండా అన్ని జిల్లాల్లో కొనుగోళ్లు చేపట్టాలని, ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కొనుగోళ్లు జరుగుతున్న తీరును పరిశీలించి, ఏమైనా సమస్యలుంటే అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రంభీం అసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు కృష్ణ ఆదిత్యకు బాధ్యతలు అప్పగించారు. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా జిల్లాలకు ఆర్వీ కర్ణన్, నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేటకు అనితా రామచంద్రన్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు డా. ఏ.శరత్, రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలకు డి.దివ్య, మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల్ మరియు నాగర్‌కర్నూల్ జిల్లాలకు రవి, వరంగల్, హనుమకొండ, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాలకు టి.వినయ కృష్ణ రెడ్డి, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు హరిచందన దాసరి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు కె.సురేంద్ర మోహన్ నియమితులయ్యారు.



# జార్ఖండ్‌లో హోరెత్తిన ప్రచారం

- ఆదివాసీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం
- లాక్కున్న భూములను తిరిగి ఇచ్చే బాధ్యత మాదే
- పదేళ్లలో 25కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశాం
- జార్ఖండ్‌ను వ్యతిరేకించిన ఆర్జెడితో జెంఎంఎం పొత్తు
- ఇక రాష్ట్రంలో అధికారం తమదే అన్న మోడీ
- ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రధాని

**తొలి అక్షరం/రాంచీ,నవంబర్ 4:** ఝూర్ఖ ండ్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రచా రం హోరెత్తుతోంది. అధికార, విపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. తాజా గా ప్రధాని మోదీ చాయిబసలో నిర్వహిం చిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొని విపక్షాలపై తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. ఝూర్ఖండ్‌లో కాంగ్రెస్, ఆర్జేడీ ఆదివాసీలపై అనాగరిక నేరాలకు పాల్పడ్డాయని ధ్వజమెత్తారు. ఆనాడు ఝూర్ఖండ్ ఏర్పాటును ఆర్జేడీ వ్యతిరేకించిందన్న ప్రధాని.. ఇప్పుడు జేఎంఎం దాని ఒళ్లో కూర్చొందంటూ చురకలంటించారు. ఈ సారి రాష్ట్రంలో అత్యధిక సీట్లు గెలుచుకొని చరిత్ర లిఖిస్తామని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు.ఝూర్ఖండ్‌లో భాజపా ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే చొరబాటు దారులను అడ్డుకొనేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. అక్రమంగా లాక్కున్న భూమిని తిరిగి ఆదివాసీ మహిళల పేర్లపై బదలాయించేలా చట్టాన్ని తీసుకొస్తా మన్నారు. కాంగ్రెస్ రిజర్వేషన్లు రద్దు చేసి ఓటు బ్యాంకుకు అప్పగించేందుకు చూస్తోందని, ఓటు బ్యాంకు కోసం ఝూర్ఖండ్ జనాభా మార్చే విషయంలో జేఎంఎం-కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నాయని ప్రధాని వివరాలు 2లో



- ఎక్కడిక్కడే మాజీ సర్పంచ్‌ల అరెస్ట్
- మద్దతుగా బిఆర్ఎస్ నేతల ఆందోళన
- హరీష్ రావు తదితరుల అరెస్ట్
- అరెస్ట్‌లను ఖండించిన కెటిఆర్ తదితరులు

# పెండింగ్ బిల్లుల కోసం చలో హైదరాబాద్

**తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 4:** పెండింగ్ బిల్లులు విడుదల చేయాలంటూ తెలంగాణలో మాజీ సర్పంచులు పోరుబాట పట్టారు. సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చేందుకు హైదరాబాద్ చేరుకుని ఓ హోటల్‌లో సమావేశమయ్యారు. అనంతరం హోటల్ బయటకు వచ్చిన వారిని పోలీసులు అరెస్టు చేశారు. ఛలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చారు.మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టిన వారిని ఎక్కడికక్కడ పోలీసులు అరెస్ట్ చేశారు. తమ సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి ఇంటికి వెళ్లి వినతి పత్రం ఇవ్వనున్నామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మాజీ సర్పంచులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టులు చేసారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో సమావేశమైన మాజీ సర్పంచులను అదుపులోకి తీసుకున్నారు. దీంతో రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్, రాష్ట్ర ఉపాధ్యాక్షులు గుండి మధుసూదన్ రెడ్డి, రేపాక నాగయ్య, వివరాలు 2లో

# నేడు నగరానికి వస్తున్న రాహుల్

- 400 మంది ప్రతినిధులతో ఇంటరాక్షన్
- కులగణనపై చర్చించే ఛాన్స్




# యాప్ ద్వారా ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక

- అర్హులైన పేదలందరికీ ఇళ్ల నిర్మాణం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి



**తొలి అక్షరం/ఖమ్మం,నవంబర్ 4:** ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రత్యేక యాప్‌ను రూపొందించామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పార్టీలకు, కులాలకు అతీతంగా గ్రామ సభలు పెట్టి అర్హులైన పేదలకు ఇళ్లు నిర్మించే కార్యక్రమం చేపట్టామని అన్నారు.మరో రెండు రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల పక్రియ మొదలవుతుందని చెప్పారు. ఖమ్మం రూరల్ మండలం దానావాయిగూడెంలో రెవెన్యూ శాఖ వివరాలు 2లో

# ప్రజలపై భారం పడకుండా ఆదాయం పెంపు

## డిప్యూటీ సిఎం మల్లు భట్టి ఆదేశం



**తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 4:** ప్రజలపై భారం పడకుండా ఆదాయం పెంచే మార్గాలపై దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన రిసోర్స్ మొబిలైజేషన్ కేబినెట్ సబ్ కమిటీ సమావేశమైంది. సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లుతో పాటు మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరయ్యారు. జాయింట్ వెంచర్స్‌లో విలువైన ఆస్తులు ఉన్నాయి.. ప్రైవేట్ వ్యక్తులు కోర్టుకు వెళ్లి వివాదాలు సృష్టిస్తున్నారన్నారు. ఈ అంశంపై నలుగురు ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణారావు అధ్యక్షతన మున్సిపల్, హౌసింగ్, లా సెక్రెటరీలతో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కమిటీ సమావేశమై వారంలోగా సమస్యకు పరిష్కారం అయ్యేలా ప్రణాళికలు రూపొందించాలని వివరాలు 2లో

# ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి




# తెలంగాణ టెట్ నోటిఫికేషన్ విడుదల




**తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 4:** తెలంగాణ టెట్ నోటిఫికేషన్ విడుదలైంది. పాఠశాల విద్యాశాఖ ఈమేరకు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. నవంబర్ 5 వ తేదీ నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించేందుకు అవకాశం కల్పించారు. వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించనున్నారు. పూర్తి వివరాల కోసం రేపటి నుంచి వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చు. కాగా, ఈ ఏడాది మే 20వ తేదీ నుంచి జూన్ 2వ వరకు ఆన్‌లైన్‌లో టెట్ పరీక్షలు నిర్వహించి ఇప్పటికే ఫలితాలు విడుదల చేసిన సంగతి తెలిసిందే. కాగా ఈ ఏడాది ఇది రెండో నోటిఫికేషన్ కావడం గమనార్హం.

## 8న యాదాద్రిలో సిఎం రేవంత్ పూజలు

### - అదేరోజు మూసీ పరివాహకంలో పాదయాత్ర

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 4: ఈ నెల 8న తన పుట్టినరోజు సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి యాదాద్రి క్షేత్రంలో పూజలు చేయనున్నారు. అదే రోజు మూసీ పరివాహక ప్రాంతాల్లో పాదయాత్ర చేసే అవకాశం ఉంది. భువనగిరి నుంచి వలిగొండ వైపు పాదయాత్ర చేయనున్నారని సమాచారం. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల పైపులైన్లకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. మూసీ కోసం పాదయాత్రచేస్తానన్న సిఎం రేవంత్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల పైపులైన్లకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. మూసీ పరివాహక ప్రాంతాల్లోని రైతులు, ప్రజలను కలిసి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకోనున్నారు. సీఎం పర్యటన క్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య హెలిప్యాడ్, ఆలయ పరిసరాలను పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని నిర్దేశించారు. అటు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో ఉమ్మడి నల్గొండ జిల్లా కాంగ్రెస్ నేతలు సమావేశమయ్యారు. ఆయనతో ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు చర్చించారు.

## ఆదాయా మార్గాలపై ప్రభుత్వం దృష్టి

### - భట్టి నేతృత్వంలో ఉపసంఘం భేటీ

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 4:నిధుల సమీకరణపై మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన దీన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఖజానాకు అదనపు నిధుల సమీకరణపై సమావేశంలో చర్చించారు. సంబంధిత శాఖల అధికారులతో ఉపసంఘం చర్చలు సాగాయి. రాష్ట్రంలో ఆదాయం తగ్గడంతో పాటు అప్పులు పెరుగుతున్నాయి. అలాగే పథకాల అమలుకు కూడా నిధులు వెచ్చించాల్సి వస్తోంది. దీంతో రాబడి పెంచుకునే మార్గాలపై అన్వేషిస్తున్నారు. ఇప్పటికే రియల్ ఎస్టేట్ ఆదాయం భారీగా పడిపోయింది. కొనుగోళ్లు, అమ్మకాలు తగ్గాయి. ఈ క్రమంలో ఆదాయ మార్గాలను అన్వేషిస్తున్నారు.

## డిసెంబర్ 19 నుంచి 29 వరకు పుస్తక ప్రదర్శన

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 4: హైదరాబాద్ నగరంలో 37వ పుస్తక ప్రదర్శన తేదీలను నిర్వాహకులు ఖరారు చేశారు. డిసెంబర్ 19 నుంచి 29 వరకు ప్రదర్శన నిర్వహించనున్నట్లు పుస్తక ప్రదర్శన సొసైటీ వెల్లడించింది. సోమాజిగూడలోని ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎల్ సి కోదండరాం, పుస్తక ప్రదర్శన సలహాదారు ఆచార్య రమా మెల్కోటె, సీనియర్ జర్నలిస్ట్ కె. రామచంద్రమూర్తి తదితర పలువురు ప్రముఖులు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శన లోగోని ఆవిష్కరించారు. ప్రదర్శనలో మొత్తం 300 స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు.

## సాంకేతకి సమస్యతో ఆలస్యంగా మెట్రో ప్రయాణం

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 4:హైదరాబాద్ మెట్రో రైళ్లలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో రైళ్లు ఆలస్యంగా నడిచాయి. రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఎల్బీనగర్-మియాపూర్ మెట్రో మార్గంలో సాంకేతిక సమస్య కారణంగా రైళ్లు నెమ్మదిగా నడిచాయి. విద్యుత్ ఫీడర్ ఛానల్‌లో సాంకేతిక సమస్య వచ్చిందని మెట్రో అధికారులు తెలి పారు. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పా రు. రైళ్ల ఆలస్యంతో స్టేషన్ల వద్ద ప్రయాణికుల రద్దీ పెరిగింది.

## యువతిపై ప్రమోన్మాది దాడి

### - గాయాలతో యువతి ఆస్పత్రికి తరలింపు

తొలి అక్షరం/మెదక్,నవంబర్ 4: ప్రేమించడం లేదని యువతిపై ఓ ప్రమోన్మాది కత్తితో దాడికి దిగాడు. దీంతో ఆమెకు తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద జరిగింది. యువతిపై ప్రేమోన్మాది ఇక్కడే దాడి చేశాడు. ఈ ఘటనలో ఆమె చేతికి తీవ్రగాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం యువతిని హైదరాబాద్‌కు తరలించారు. ఆమె ఓపెన్ డిగ్రీ పరీక్షలు రాసేందుకు వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. దాడి చేసిన వ్యక్తి బెంగళూరుకు చెందిన యువకుడు చేతన్ అలియాస్ కిరణ్ అని పోలీసులు తెలిపారు. నిందితుడు ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. పోలీసులు సంఘటనా స్థలిని పరిశీలించి వివరాలు సేకరించారు. దుండగుడి కోసం గాలిస్తున్నారు.

## కాళోజీ వర్సిటీలో హోమియో ఎండి

### - దరఖాస్తులను ఆహ్వాంచిన వర్సిటీ

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 4: కాళోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీలో ఎండీ హోమియో కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. 2024-25 విద్యాసంవత్సరానికి గానూ మేనేజ్‌మెంట్ కోటాలో ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో నవంబర్ 5వ తేదీ ఉదయం 10 గంటల నుంచి నవంబర్ 10 సాయంత్రం 6 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణ అనంతరం వెబ్ ఆప్షన్ల నమోదు కోసం త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. వెబ్ ఆప్షన్ల నమోదు తర్వాత మెరిట్ లిస్ట్ విడుదల చేయనున్నారు. దరఖాస్తుతో పాటు తదితర వివరాల కోసం వెబ్‌సైట్‌ను లాగిన్ అవొచ్చని తెలిపారు.

## జార్ఖండ్‌లో హోరెత్తిన ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. పేదల కష్టాలను దగ్గర నుంచి చూశానన్న మోదీ.. అందుకే పదేళ్లలో పేదల కోసం పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఈ పథకాల ఫలితంగానే పదేళ్లలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు మాత్రం చాలా కాలంగా ఆదివాసీ సమాజాన్ని పేదరికంలోనే ఉంచాయని ఆక్షేపించారు. ఝార్ఖండ్‌లో పేదరిక నిర్మూలనకు భాజపా కట్టుబడి ఉందన్నారు. ఎన్డీయే కూటమి ప్రచారంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం రాష్ట్రంలోని ఛాయ్‌బస పట్టణంలో ఎన్నికల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే కూటమి జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో తప్పకుండా విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో తనకు ఇది రెండవ ర్యాలీయే అయినప్పటికీ గెలుపుపై ఇప్పటికే నమ్మకం కుదిరిందని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచారం కోసం తొలిసారి ఇక్కడి వచ్చాను. ఇది నాకు రెండవ ఎన్నికల ర్యాలీ. ఈ రెండు ర్యాలీలు చూసిన తర్వాత.. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా సగాని కంటే ఎక్కువ సీట్లను బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే కూటమి గెలుచు కుంటుందని నేను నమ్మకంతో చెప్పగలను అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. గిరిజన సోదర, సోదరీమణుల ఆకాంక్షలకు అనుగుణంగా బీజేపీ ఏవిధంగా పనిచేస్తోందో మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇక కేంద్రంలో బీజేపీ తొలిసారి ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పుడు గిరిజన సమాజం కోసం ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిందని ప్రస్తావించారు. గిరిజన అక్కచెల్లెళ్లు, అన్నదమ్ముళ్ల ఆత్మ గౌరవమే బీజేపీకి అత్యంత ముఖ్యమైనదని మోదీ అన్నారు. అందుకే తొలిసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు గిరిజనుల కోసం రాష్ట్రాన్ని ఇచ్చామని అన్నారు. ఢిల్లీ నుంచి పని చేసే అవకాశం అటల్ బిహారీ వాజ్‌పేయికి దక్కిందని, ఆయన హయాంలోనే గిరిజన రాష్ట్రాలు ఏర్పడ్డాయని మోదీ గుర్తుచేశారు. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ వాజ్‌పేయి హయాంలోనే ఏర్పాటు అయ్యాయని మోదీ చెప్పారు. ఇక రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సమస్యల పరిష్కారంపై దృష్టిసారిస్తామని మోదీ హామీ ఇచ్చారు. ధరలు తగ్గించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇక చట్టవిరుద్ధంగా గిరిజన కూతుళ్ల నుంచి గుంజుకున్న భూములను వెనక్కి ఇప్పిస్తామని మోదీ హామీ ఇచ్చారు. జార్ఖండ్ రాష్ట్ర గుర్తింపును మసక బార్చుతున్నారని జేఎంఎం-కాంగ్రెస్-ఆర్జేడీ కూటమిపై మోదీ తీవ్ర విమర్శలు గుప్పించారు. జార్ఖండ్ గుర్తింపు మార్చివేసే కుట్ర జరుగుతోందని మోదీ అన్నారు. రాష్ట్రంలో చొరబాటుదారులకు జేఎంఎం-కాంగ్రెస్- ఆర్జేడీ మద్దతిస్తున్నాయని అన్నారు. చొరబాటుదారులే వారి అతిపెద్ద ఓటు బ్యాంక్. జేఎంఎం, కాంగ్రెస్ పార్టీలు చొరబాటుదారుల కోసం ఫేక్ సర్టిఫికేట్లు తయారు చేస్తున్నాయి. గిరిజన ఆడబిడ్డలను చొరబాటుదారులు టార్గెట్‌గా చేసుకుంటున్నారు. ఆడ కూతుళ్ల నోటి కాడా కూడు, భూమి లాక్కుంటున్నారు. అంతేకాదు జేఎంఎం, కాంగ్రెస్ కూటమి స్కూళ్లు, కాలేజీలు, యూనివర్సిటీలను మైనారిటీ ఇన్‌స్టిట్యూషన్లను ప్రకటిస్తున్నాయి. ఈ విద్యా సంస్థల్లో దళితులు, గిరిజనులు, ఓబీసీల రిజర్వేషన్లకు ముగింపు పలుకుతున్నాయని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.మాజీ ఎమ్మెల్యే సీతా సోరెన్‌ను అవమానించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ దేశంలోని మహిళలను కించపరిచిందన్నారు. జేఎంఎం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం యువతను రిక్రూట్‌మెంట్ మాఫియాకు అప్పగించి.. పేపర్ లీక్‌లతో వారి భవిష్యత్తు నాశనం చేస్తోందని మోదీ మండిపడ్డారు. ఆదివాసీల సంక్షేమానికి ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని కూడా కాంగ్రెస్ ఆలోచించలేదని.. ఈ పని ఎన్డీయే చేసిందన్నారు.

## పెండింగ్ బిల్లుల కోసం చలో హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)

గుర్రాలదండి ఆంజనేయులు, దుంప ఆంజనేయులుతోపాటు పలువురు మాజీ సర్పంచులను అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా ధరాకు మద్దుతగా వచ్చిన మాజీ మంత్రి హరీశ్ రావును అరెస్ట్ చేశారు పోలీసులు. మాజీ సర్పంచులకు మద్దతుగా తిరుమలగిరి పీఎస్ ముందు రోడ్డుపైన హరీశ్ రావుతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు మండలి ప్రతిపక్ష నేత మధుసూధనాచారి, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి, డాక్టర్ సంజయ్ తోపాటు పలువురు నిరసనకు దిగారు. దీంతో పోలీసులు వాళ్లను పీఎస్ కు తరలించారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ ఛలో హైదరాబాద్‌కు మాజీ సర్పంచ్ లు పిలుపునిచ్చారు. అయితే హైదరాబాద్ కు వెళ్లకుండా మాజీ సర్పంచ్ లను ముందస్తుగా అరెస్ట్ చేశారు పోలీసులు . జగిత్యాల జిల్లా వ్యాప్తంగా ఉన్న పలువురు మాజీ సర్పంచులను అరెస్ట్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్లకు తరలించారు. మాజీ సర్పంచుల అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సీఎంను కలిసేందుకు వచ్చిన వారిని అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. గ్రామాభివృద్ధి కోసం ఖర్చు చేసిన డబ్బు ఇవ్వాలని కోరితే అరెస్టులు చేస్తారా అని ప్రశ్నించారు. వారంతా అప్పులు తెచ్చి, ఆస్తులు అమ్మి, భార్యాపిల్లల బంగారం తాకట్టు పెట్టారన్నారు. ప్రజాపాలన అంటే ఊరికి సేవ చేసిన మాజీ సర్పంచులను అరెస్టు చేయడమేనా?అని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తారు.. సర్పంచులకు చెల్లించరా? అని నిలదీశారు. మాజీ సర్పంచులను వెంటనే విడుదల చేయాలని.. బిల్లులు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరుతూ పోరుబాటకు పిలుపునిచ్చిన మాజీ సర్పంచ్‌లను రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో మాజీ మంత్రి పోస్టు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం ఇవ్వాలని హైదరాబాద్‌కు వస్తే వారిని అడ్డుకోవడం, అక్రమంగా నిర్బంధించడం అప్రజాస్వామికమన్నారు. అప్పులు తెచ్చి, ఆస్తులు అమ్మి, భార్యా పిల్లల మీద ఉన్న బంగారం కుదువ పెట్టి గ్రామ అభివృద్ధి కోసం చేసిన డబ్బులు ఇవ్వాలంటే ప్రభుత్వం అరెస్టులు చేస్తోందని మండిపడ్డారు.ప్రజాపాలన అంటే ఊరికి సేవ చేసిన సర్పంచ్‌లను అరెస్టులు చేయడమేనా అని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ, చిన్న పనులు చేసిన మాజీ సర్పంచ్‌లకు మాత్రం బిల్లులు చెల్లించక పోవడంలో ఆంతర్యం ఏమిటని నిలదీశారు. అక్రమంగా నిర్బంధించిన, అరెస్టులు చేసిన మాజీ సర్పంచ్‌లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్ బిల్లులను తక్షణం చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని హరీష్‌రావు ఎక్స్‌లో పోస్టు చేశారు. పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచులు ఏడాదిగా తిరుగుతున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. శాంతియుతంగా నిరసన చేస్తున్న వారిని ఎందుకు అరెస్టు చేస్తున్నారని ప్రశ్నించారు. పల్లె ప్రగతి పేరుతో తాము చేపట్టిన కార్యక్రమానికి తూట్లు పొడిచారని కేటీఆర్ ఆరోపించారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలన్న మాజీ సర్పంచులను అరెస్టు చేయడాన్ని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఖండించారు. ప్రజాపాలన అని చెప్పుకుంటున్న కాంగ్రెస్, రేవంత్ సర్కార్ ఉదయం 4 గంటలకే వారిని అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లలో బందించడం హేయమైన చర్య అన్నారు. అప్పులు తెచ్చి చేసిన పనులకు బిల్లులు అడిగితే అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు చేసిన పనులకే డబ్బులు ఇవ్వమంటే ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకు ఇంత కోపమొచ్చిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌కు మాజీ సర్పంచులంటే ఎందుకింత కోమని విమర్శించారు. చిన్న కాంట్రాక్టర్లకు చెల్లించేందుకు డబ్బులు ఉండవు కానీ, బడా కాట్రాక్టులకు కమిషన్ల కోసం బిల్లులు చెల్లించేందుకు డబ్బులు ఉంటాయన్నారు. సర్పంచ్‌లకు బిల్లులు చెల్లించడానికి డబ్బులు లేవు కానీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాజగోపాల్ రెడ్డిలకు ఇవ్వడానికి, రూ.లక్షన్నర కోట్లతో మూసీ ప్రాజెక్ట్ చేపట్టడానికి రేవంత్ రెడ్డి దగ్గర డబ్బు ఉందని మండిపడ్డారు. పది నెలలుగా అడుగుతున్నా బిల్లులు చెల్లించకుండా సర్పంచ్‌లను ప్రభుత్వం వేధిస్తున్నదని చెప్పారు. ఇప్పటికే గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది, పారిశుద్ధ్యం పడకేసిందని విమర్శించారు. మాజీ సర్పంచ్‌ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ చేసిన మాజీ సర్పంచ్‌లను బేషరతుగా విడుదల చేయాలన్నారు.

## నేడు నగరానికి వస్తున్న రాహుల్

- 400 మంది ప్రతినిధులతో ఇంటరాక్షన్
- కులగణనపై చర్చించే ఛాన్స్



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 4:ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ మంగళవారం హైదరాబాద్ రానున్నారు. బోయిన్ పల్లిలోని గాంధీ ఐడియాలజీ సెంటర్ లో మేధావులతో జరిగే సమావేశంలో పాల్గొంటారు. దాదాపు 400 మంది వివిధ వర్గాల వారితో ఇంటరాక్ట్ అవుతారు. దేశంలోనే మొట్టమొదటి సారిగా తెలంగాణలో కులగణన ఈ నెల 6 నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో వివిధ వర్గాలతో ఇంటరాక్ట్ అయ్యేందుకు రాహుల్ వస్తున్నారు. కులగణన వాస్తవ పరిస్థితులపై మేధావులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నేతలతో భేటీ అవుతారు. ట్రాన్స్ జెండర్లు, మహిళలతోనూ ముచ్చటిస్తారు. కులగణన ఎలా చేయాలనే అంశాలపై వారితో చర్చిస్తారు. సాయంత్రం 4.45 గంటలకు ఆయన ప్రత్యేక విమానంలో బేగంపేట ఎయిర్ పోర్టుకు చేరుకుటారు. అక్కడి నుంచి సాయంత్రం 5 గంటలకు బోయిన్ పల్లి బయల్దేరుతారు. 5.20 గంటలకు అక్కడికి చేరుకొని 5.30 గంటల నుంచి 6.30 వరకు ష్త్రంలో అమలు చేయనున్న కుల గణనపై వివిధ వర్గాల, వివిధ రంగాల వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తారు. 7.10 లకు బేగంపేటకు చేరుకొని ఢిల్లీ బయల్దేరి వెళ్తారు.

## ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 4:మెరుగైన ఫర్నిచర్, ల్యాబ్స్‌పై ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. విద్యానగర్ జామై ఉస్మానియా పాఠశాలకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బెంచీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రైవేటు బడులకు దీటుగా ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలు పెరగాలన్నారు. సర్కారు బడుల అభివృద్ధికి సమాజమంతా బాధ్యత తీసుకోవాలని సూచించారు. కర్నాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యం కనిపిస్తోందన్నారు దివాళకోరు, దగాకోరు రాజకీయాలు చేయడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందన్నారు. అమలు కానీ హామీలు ఇవ్వడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని కిషన్ రెడ్డి చురకలంటించారు. ఇచ్చిన హామీలకే గతిలేదని, కొత్తగా మళ్లీ హామీలిస్తున్నారన్నారు. కర్నాటకలో హామీలు అమలు చేయలేక చేతులెత్తేశారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో అనేక వాగ్దానాలతో కాంగ్రెస్ అధికారులోకి వచ్చిందని దుయ్యబట్టారు. డిక్లరేషన్, గ్యారంటీల పేరుతో గారడీ చేశారని కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు.

## యాప్ ద్వారా ఇందిరమ్మ లబ్దిదారుల ఎంపిక

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ... ఈయాప్ ద్వారా ఇళ్ల నిర్మాణం పరిశీలన జరుగుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం కోసం రూరల్‌లో రూ.71 వేలు , అర్బన్‌లో లక్షా యాభై వేలు రూపాయలు ఇస్తుందని తెలిపారు. మిగిలిన డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం భరించి పేదవారి చిరకాల స్వప్నం నెరవేరుస్తుందని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వంలో పింక్ కలర్ చొక్కా వేసుకున్న వారికే స్కీంలు ఇచ్చారని.. వారు ఇంకా అదే భ్రమలో ఉన్నారని విమర్శించారు. గ్రామ సభలు పెట్టి మంత్రుల ద్వారా ఇళ్లను అప్రూవ్ చేస్తామని అన్నారు. ఈ ప్రభుత్వానికి పేదవారికి అండగా ఉండాలనే ఆలోచన ఉందని స్పష్టం చేశారు. అర్హులైన వారు ఏ పార్టీలో ఉన్నా వారికి ఇళ్లు ఇస్తామని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వంలో లక్షా యాభై వేల డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టామని బీఆర్ఎస్ నేతలు చెప్పారని అన్నారు. కేవలం 91 వేల ఇళ్లు మాత్రమే కట్టి అందులో మౌలిక వసతులు కల్పించలేదని ధ్వజమెత్తారు. తెలంగాణలో 63 వేల డబుల్ బెడ్ రూం ఇళ్లు వివిధ దశల్లో నిలిచి పోయాయని.. వాటిని కూడా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు.

## ప్రజలపై భారం పడకుండా ఆదాయం పెంపు

(మొదటి పేజీ తరువాయి)

భట్టి విక్రమార్క ఆదేశించారు. రాజీవ్ స్వగృహ ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న ఎ÷-లాట్ల స్థితిగతులను సబ్ కమిటీ సమీక్షించింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో 5 ఎకరాల విస్తీర్ణంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ఇండస్ట్రియల్ పార్కు నిర్మించాలని పరిశ్రమల శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

## 24 గంటల కరెంట్ ఘనత కెసిఆర్‌దే

- తప్పదోవ పట్టించేలా కాంగ్రెస్ ప్రచారం
- మండిపడ్డ మాజీమంత్రి హరీష్ రావు



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 4:24 గంటల కరెంటు విషయంలో దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్న జాతీయ కాంగ్రెస్ వైఖరిపై సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. నవ్విపోదురు గాక, నాకేం సిగ్గు అన్నట్టుంది కాంగ్రెస్ పార్టీ తీరు ఉన్నదని ఎద్దేవా చేశారు. దేశంలో రైతులకు 24 గంటల ఉచిత కరెంటును అందించిన ఏకైక రాష్ట్రంగా తెలంగాణను నిలిపింది బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ అని చెప్పారు. 2018, జనవరి 1 నుంచే రాష్ట్రంలో అన్నదాతలకు 24 గంటల ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. కానీ, ఆ ఘనత కూడా తమదేనంటూ ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. గతంలో రైతులకు 24 గంటల ఉచిత కరెంటు దండగ అని, మూడు గంటల కరెంటు సరిపోతుందని రైతు వ్యతిరేక వైఖరిని ప్రకటించిన చరిత్ర రేవంత్ రెడ్డిది, కాంగ్రెస్ పార్టీదని మండిపడ్డారు. ఇప్పుడేమో ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో ఓట్ల కోసం కేసీఆర్ అందించిన 24 గంటల ఉచిత కరెంటు ఘనతను తమ ఖాతాలో వేసుకుంటూ దేశవ్యాప్తంగా ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు విమర్శించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో సాధించిన అభివృద్ధిని చూపించుకునే ముఖం లేక, తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ సాధించిన అభివృద్ధిని చూపించి ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరికి, మోసపూరిత విధానానికి మరో నిదర్శనమని చెప్పారు.

## జడ్పిహెచ్ఎస్ కేసముద్రం విలేజ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా చీకటి వెంకట్రాం నర్సయ్య.




**తొలి అక్షరం/కేసముద్రం, నవంబర్ 4:** మహబూబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని విలేజి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా చీకటి వెంకట్రాం నర్సయ్య బాధ్యతలు స్వీకరించారు, ఇట్టి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గా పనిచేస్తున్న శ్రీ కొత్త జగన్మోహన్ రెడ్డి అక్టోబర్ 31న పదవీ విరమణ పొందినారు. అట్టి స్తానములో జిల్లా విద్యాశాఖ అధికారి, మహబూబాబాద్ గారు చీకటి వెంకట్రాం నర్సయ్య ని ప్రధానోపాధ్యాయులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా బాధ్యతలు చేపట్టారు.

## రాష్ట్రస్థాయి క్రీడల్లో రజత పతకాలు సాధించిన 'సిద్ధార్థ' స్కూల్ విద్యార్థులు.....



**తొలి అక్షరం/తొర్రూర్ రూరల్, నవంబర్ 4:** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం సెయింట్ జాన్స్ హైస్కూల్లో జరిగిన 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'వూషూ' రాష్ట్రస్థాయి ఛాంపియన్షిప్ పోటీలలో మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణ కేంద్రంలోని సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థులు అండర్ 19 బాలుర 65కేజీల విభాగంలో శ్రీనాథ్, 60 కేజీల విభాగంలో మధు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో రజత పతకాన్ని సాధించారు. రాష్ట్రస్థాయి క్రీడలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సోమవారం సిద్ధార్థ హైస్కూల్ చైర్మన్ ముత్తినేని సోమేశ్వరరావు, ప్రిన్సిపల్ జయప్రకాష్ ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ స్కూల్ సిబ్బంది ప్రభాకర్, కుమారస్వామి, భానుచందర్, కవిత, రమేష్, విజయ, బోధనేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం




**తొలి అక్షరం/చెన్నారావుపేట, నవంబర్ 4:** చెన్నారావుపేట మండలం, కోనాపురం గ్రామంలో సోమవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక చెన్నారావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ముద్దసాని సత్యనారాయణ రెడ్డి ప్రారంభించారు.వరి ధాన్యం ఏ గ్రేడ్ 2320రూ. కామన్ 2300రూ మరియు సన్న ధాన్యానికి 500రూ. అదనపు బోనస్ కలిపి 2820రూ. రైతులకు చెల్లిస్తున్నారు.ఈ కార్యక్రమంలో సీఈఓ చిట్టే రవి, సొసైటీ డైరెక్టర్ మంజుల నారాయణరెడ్డి, డైరెక్టర్ జున్నుతుల మహేందర్ రెడ్డి, బానోత్ ఫుల్ శంకర్, ఏవో గోపాల్ రెడ్డి, ఏఈవో శశికుమార్, కౌడగాని రాజీరు, చిలువేరు చిరంజీవి, చిలువేరు రంజిత్, మైదం పోషాలు, తాంద్ర స్వామి, భూక్యరాజు, మంతుర్తి అన్వేష్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నిందితున్ని రిమాండ్

**తొలి అక్షరం/నరసింహుల పేట నవంబర్ 4:** గత నెల దసరా పండుగ రోజున వరకట్నం పేరుతో వేదించిన విషయంలో మండలంలోని దాసుతండా కు చెందినా వివాహిత మహిళ పురుగుల మందు తాగాగ, తన తండ్రి ఫిర్యాదు మేరకు కేసు రిజిస్టర్ చేయడం జరిగింది. తేదీ 01.11.2024 రోజున పురుగుల మందు తాగిన మహిళ చికిత్స పొందుతూ మరణించడం జరిగింది. కేసును దర్యాప్తు చేసిన నిందితున్ని రిమాండ్ చేసినట్లు స్థానిక ఎస్సై మాలోత్ సురేష్ సోమవారం ఆయన తెలిపారు.

## తొర్రూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌ను సన్మానించిన పాలకుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్..



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో (సాంబ) నవంబర్ 04:** తొర్రూరు మార్కెట్ కమిటీ చైర్మన్ గా నియమితులైన హనుమాండ్ల తిరుపతి రెడ్డిని పాలకుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.తిరుపతి రెడ్డిని శుభాకాంక్షలు తెలిపిన వారిలో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్య నాయక్,తొర్రూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూంచు సంతోష్,పాలకుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ రాజేష్ నాయక్,తొర్రూరు మండల యువజన అధ్యక్షుడు ప్రవీణ్ యాదవ్,పాలకుర్తి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసు హరీష్ గౌడ్,పెద్ద వంగర మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు హరికృష్ణ గౌడ్,కోడకండ్ల మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు యాకన్న యాదవ్,తొర్రూరు టౌన్ అధ్యక్షుడు మహేష్ యాదవ్,దేవరుప్పుల మండల యువజన కాంగ్రెస్ నాయకుడు వెంకన్న యాదవ్,జిల్లా యువజన కాంగ్రెస్ నాయకుడు అభిరామ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## నిస్వార్ధంగా ప్రజలకు పోలీస్ సేవలు అందించడమే మన కర్తవ్యం



**తొలి అక్షరం/మహబూబాబాద్ టౌన్, నవంబర్ 4:** ఎస్పీ మర్యాదపూర్వకముగా కలసిన 2009 బ్యాచ్ పోలీస్ సిబ్బంది.2009 లొ పోలీస్ కానిస్టేబుల్స్ గా భర్తీ అయ్యి చిత్తశుద్ధి తో ప్రజలకు పోలీస్ సేవలు అందిస్తూ 15 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈరోజు మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్ నీ కలవడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..15 సంవత్సరాలు ఎలాంటి మచ్చ లేకుండా నిజాయితీగా నిస్వార్థంగా ప్రజలకు పోలీస్ సేవలు అందించారు. ఇలానే సేవలు అందిస్తూ పదోన్నతులు పొంది ఇంకా పై స్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు.15 వసంతాలు పూర్తి చేసుకున్నాందుకు శుభాకాంక్షలు తెలియజేసారు.

## కేసముద్రం మండలంలో టిడిపి సభ్యత్వ నమోదు ప్రారంభం




**తొలి అక్షరం/కేసముద్రం అక్టోబర్ 4:** మహబాద్ నియోజకవర్గం కేసముద్రం మండలంలో సోమవారం టిడిపి మండల పార్టీ కన్వీనర్ ఏషబోయిన ఎల్లయ్య యాదవ్ ఆధ్వర్యంలో టిడిపి పార్టీ సభ్యత్వ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్లమెంట్ అడహక్ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ పార్టీ ఉపాధ్యక్షులు బండి పుల్లయ్య, మాజీ రాష్ట్ర పార్టీ కార్యదర్శి యండి ఇమామ్ హాజరై టిడిపి సభ్యత్వ నమోదు కార్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి పుల్లయ్య మాట్లాడుతూ తెలుగుదేశం తెలుగుదేశం పార్టీ తెలుగువారి పార్టీ అని, టిడిపి ఆధ్వర్యంలోనే అన్ని సంక్షేమ కార్యక్రమాలకు అంకురార్పణ జరిగిందని, భవిష్యత్తులో కూడా తెలుగుదేశం పార్టీ పునర్ వైభవం వస్తుందని, ఆ విషయం తెలుగుదేశం పార్టీ ప్రతి కార్యకర్త మనసులో ఉందని, దానిని బయటికి తీసెలా ప్రతి పార్టీ అభిమాని, కార్యకర్త క్షేత్రస్థాయి నుండి కృషిచేయాల్సిన అవసరం ఉందని, పార్టీ అభిమానులు పార్టీకి తిరిగి వచ్చి ప్రస్తుతం పార్టీ సభ్యత్వం నమోదు చేసుకొని, పార్టీ సభ్యత్వం చేయటం ద్వారా గుర్తింపు పొంది పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేయాలని ఈ సందర్భంగా అన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వం ద్వారా గతంలో రెండు లక్షల ఇన్సూరెన్స్ నుంచి 5 లక్షల వరకు ప్రమాద బీమా పెంచారని, చనిపోతే పది వేలు మట్టి ఖర్చులు, పిల్లల చదువు ఖర్చు కు పార్టీ సహాయం చేస్తుందని, ప్రతి గ్రామంలో తెలుగుదేశం పార్టీ అభిమానులు కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కేసముద్రం మండల కార్యకర్తలకు ఈ సందర్భంగా బండి పుల్లయ్య పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ ఏషబోయిన ఎల్లయ్య తో పాటు కురవి మండల పార్టీ కన్వీనర్ పిరం వీర స్వామి, కేసముద్రం మండల గ్రామ నాయకులు మల్లేష్, ముత్తయ్య, హర్లా నాయక్, గుగులోత్ రమేష్, వాగ్యా తదితరులు పాల్గొన్నారు


## విద్యుత్ సమస్యల పరిష్కరించడానికి కృషి చేస్తాం

- ప్రభుత్వ విఫ్ డోర్నకల్ శాసన సభ్యులు రామచంద్రు నాయక్



**తొలి అక్షరం/దంతాలపల్లి నవంబర్ 04:** దంతాలపల్లి మండల కేంద్రంలో గల బాలాజీ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన విద్యుత్ సమస్యల పరిష్కార సమావేశంలో డోర్నకల్ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ జాటోత్ రామచంద్రనాయక్ మాట్లాడుతూ గ్రామ గ్రామాన ఉన్నటువంటి విద్యుత్తు సమస్యల పరిష్కారానికి అన్ని గ్రామాల సమస్యలను వినతులను తీసుకోవడం జరిగిందని అన్నారు గ్రామాల్లో ఉన్న ట్రాన్స్ఫార్మర్ మరియు విద్యుత్ ఇబ్బందులను పరిష్కరించడానికి కృషి చేస్తానని అన్నారు ముఖ్యంగా రైతులు ప్రజలు ఇబ్బంది పడకుండా విధ్యుత్ పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు విద్యుత్ శాఖ సిబ్బంది చేస్తున్నటువంటి అనేక కార్యక్రమాలను వాటిపై సమీక్ష నిర్వహించారు ప్రజలు ఇబ్బంది పడకుండా కృషి చేస్తానని ఎవరు ఈ ఆందోళన చెందవద్దని విద్యుత్ విషయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి కృషి చేస్తానని అన్నారు ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు డి ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బట్టు నాయక్,పీ ఏ సి ఎస్ చైర్మన్ సంపేట రాము, మధుసూదన్,ఎస్సీ నరేష్ ఏ ఈ మంగళపల్లి ప్రవీణ్, విద్యుత్ సిబ్బంది, వివిధ గ్రామాల రైతులు,ప్రజలు పాల్గొన్నారు.

## మహబూబాబాద్ మున్సిపల్ పరిధిలోని గాంధీపురం పాఠశాలలో కిసాన్ పరివార్ సిఈఓ డాక్టర్ వివేక్..



**తొలి అక్షరం/మహబూబాబాద్ టౌన్, నవంబర్ 4:** నిరుపేద విద్యార్థులకు చదువును చేరువ చేయాలనే లక్ష్యంతో, గాంధీపురం పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు తమ స్వంత ఖర్చులతో ఆటో ఏర్పాటు చేసి విద్యార్థులను పాఠశాలకు తీసుకువస్తున్న విషయాన్ని తెలుసుకొని.. కిసాన్ పరివార్ సిఈఓ డాక్టర్ వివేక్ ఆ.. పాఠశాలను సందర్శించి ప్రధానోపాధ్యాయులు హాల్యనాయక్ ను సన్మానించారు. పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. ఏం..చదువుతున్నారని అడిగితెలుసుకున్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు కావాల్సిన అవసరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు టై,బెల్ట్, షూస్, బ్యాగ్ లను అందజేస్తానని, పాఠశాలకు మైక్ సెట్, పాఠశాల ఆవరణలోనే ప్రమాదకరంగా ఉన్న బావికి కవరింగ్ ఏర్పాటు చేస్తానని డాక్టర్ వివేక్ మాట ఇచ్చారు.అనంతరం పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని డాక్టర్ వివేక్ సందర్శించారు. తమ పాఠశాలకు వచ్చి అవసరాలు గుర్తించి, తీరుస్తానని హామీ ఇచ్చిన కిసాన్ పరివార్ సిఈఓ డాక్టర్ వివేక్ ను పాఠశాల ఉపాధ్యాయబృందం ఘనంగా సత్కరించారు.

## ప్రభుత్వ భూముల్లో ఎన్నో ఏళ్లుగా ఇండ్లు నిర్మించుకొని ఉంటున్న పేదలకు ఇంటి నెంబర్లు నిలుపుదల ఉపసంహరించుకోండి



**తొలి అక్షరం/మహబూబాబాద్ టౌన్, నవంబర్ 4:** జీవో నెంబర్ నెం.158323/ 2019/ఎం 1ను వెంటనే ఉపసంహరించాలని నేడు జిల్లా కలెక్టర్ రేట్లో జిల్లా అడిషనల్ కలెక్టర్ కు సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి వినతి ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ భూముల్లో ఇండ్లు నిర్మించుకొని నివసిస్తున్న పేదలకు మధ్యతరగతి ప్రజలకు ఇంటి నెంబర్లు నిలుపుదల చేసే జీవో నెంబర్ ROC నెం 158323/2019/ఎం 1ను వెంటనే ఉపసర్మరించాలని కోరుతూ నేడు జిల్లా కలెక్టరేట్ లో సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సార్ రెడ్డి ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సార్ధి రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని కలెక్టర్ ను కోరారు పేదలు, మధ్యతరగతి ప్రజలకు సర్వే నెంబర్లు 551, 287, 255 ఇతర సర్వే భూముల్లో ఎన్నో ఏళ్లుగా ఇంటి నెంబర్లు ఇస్తు ప్రజల దగ్గర అన్ని విధాల అన్ని రకాల టాక్స్ లు కట్టించుకుంటుందన్నారు కానీ ఇప్పుడు వేలాదిమందికి ప్రభుత్వ భూముల్లో భూ పోరాటం చేసుకొని నివసిస్తున్న సామాన్య పేద ప్రజల ఇండ్లను సర్వే నిర్వహించి ఇంటి నెంబర్లు ఇస్తామని చెప్పి ఇప్పుడు అకస్మాత్తుగా ఈ జీవోROC నెం158323/2019/ఎం 1తీసుకురావడం వల్ల ప్రజలు ఎన్నో లక్షలు పెట్టి నిర్మించుకున్న ఇండ్లకు ఇంటి నెంబర్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు ప్రభుత్వం ఇప్పటికైనా ఇచ్చిన టువంటి జీవోను వెంటనే రద్దు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని అన్నారు స్పందించిన జిల్లా అడిషనల్ కలెక్టర్ సమస్యలు తెలుసుకొని పరిష్కరిం చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో పెరుగు కుమార్ వెలుగు శ్రావణ్ నక్క నాగార్జున దునికిని రమేష్ నరేష్ తదితరులు పాల్గొన్నారు

## కేయూ వీసిని కలిసిన మాదిగ జేఏసీ నాయకులు.....

- మాదిగ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయిశెట్టి ఉపేందర్ మాదిగ.....




**తొలి అక్షరం/తోరూర్ రూరల్, నవంబర్ 4:** యూనివర్సిటీలో జరిగిన అక్రమా నియామకాలపై విచారణ జరపాల్సిందిగా విసిని మర్యాదపూర్వకంగాకలిసి వినతి పత్రం ఇచ్చిన మాదిగ జేఏసీ నాయకులు ఈరోజు కాకతీయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ప్రతాప్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఎస్సీ వర్గీకరణ జరిగేంతవరకు యూనివర్సిటీ లో ఎలాంటి నియమకాలు చేపట్టారదని కోరారు..అనంతరం విశ్వ విద్యాలయంలో జరిగిన అక్రమాలపై విసీ గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగిందిజరిగింది. స్పందించిన వైస్ ఛాన్సర్ యూనివర్సిటీలో జరిగిన అక్రమాలపై తక్షణమే చర్యలు తీసుకుంటామని వర్గీకరణ వచ్చేంతవరకు ఎలాంటి నియమకాలు జరగవని వారు హామీ ఇచ్చారని తెలియజేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాదిగ జేఏసీ ప్రధాన కార్యదర్శి ఉపేందర్ మాదిగ. వరంగల్ ఎంఎస్ఎఫ్ కన్వీనర్ డాక్టర్. ధర్మారావు నాగయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## పరమ పవిత్రం కార్తీక మాసం

- అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి
- స్వామివారికి రుద్రాభిషేకాలు, దీప దానాలు
- ఆలయానికి పోటెత్తిన భక్తులు

**తొలి అక్షరం/గణపురం:04 :** కార్తీక మాసం నెల రోజులు ఎంతో పవిత్ర దినాలని అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి అన్నారు. కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా మొదటి సోమవారం ఆమె స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించి నందీశ్వరునికి పూజలు నిర్వహించారు. అదేవిధంగా మహిళలతో కలిసి దీప దానాలు చేశారు. కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో ఉదయం నుండే ఆలయానికి భక్తుల రద్దీ పెరిగింది వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులతో ఆలయం రద్దీగా మారింది. క్యూలైన్ లో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు జూలపల్లి నాగరాజు కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మిని శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆమె వెంట ఎంపీడీవో ఎల్ భాస్కర్ పంచాయతి కార్యదర్శి తమ ఉమ్మల్ల విజేందర్ తదితరులు పాల్గొన్నారు.



# మంచికి మారుపేరు "రాఘవరెడ్డి"..

- అయన సేవలు చిరస్మరణీయం..
- బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పరిపాటి వెంకట్ రెడ్డి..



**తొలి అక్షరం/నెల్లికుదురు,నవంబర్04:** ప్రజాసేవకు అంకితంమై ప్రజలతో మమేకమైన నాయకునిగా దశాబ్ద కాలంగా సర్పంచ్ గా గ్రామానికి చేసిన సేవలు చిరస్మరణీయం గా,మంచికి మారుపేరు గా రాఘవ రెడ్డి నిలిచి పోయాడాని మండల పార్టీ అధ్యక్షులు పరిపాటి వెంకట్ రెడ్డి కొనియాడారు.సోమ వారం నెల్లికుదురు మండలం శ్రీరామగిరి గ్రామ శివారు వెంకటాపురంనకు చెందిన పోలం రాఘవ రెడ్డి దశదిన కర్మలకు హాజరై రాఘవ రెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం వెంకట్ రెడ్డి మాట్లాడుతూ గ్రామసర్పంచ్ గా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశాడని,గ్రామంలో చిన్న పెద్ద తారతమ్యం లేకుండా అందరితో ఆప్యాయంగా ప్రేమతో పలకరించే వాడనికొనియాడారు.కుటుంబ సభ్యులు మానోదైర్యం కొల్పోకూడదన్నారు.చిత్ర పటానికి పూలమాలలు వేసినివాళులు అర్పించిన వారిలో బి ఆర్ ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు డోనికని శ్రీనివాస్, రిటైర్డ్ కండక్టర్ గొల్లపల్లి యాదగిరి ,మాజీ ఉప సర్పంచ్ కొత్త పెల్లి రాములు ,నాయకులు తూటీసత్తిరెడ్డి,బుర్ర సత్తిరెడ్డి,మడిపెద్ది బిక్షం, గుట్ట య్య,వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కొత్త రైతుల రుణాల చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే దొంతి

- ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి



**తొలి అక్షరం/చెన్నారావుపేట, నవంబర్ 4:** చెన్నారావుపేట మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో నూతన రైతులకు ఋణాల పంపిణి కార్యక్రమాన్ని నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారదాదేవి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ చెన్నారావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో గత పన్నెండు సంవత్సరాల నుండి కొత్త సభ్యులకు రుణాలు మంజూరు చేయలేదని ఇప్పుడు పదకొండు వందల మంది రైతులకు రుణాలు ఇవ్వడానికి కావలసిన నిధులు ఇచ్చామనీ జిల్లా సహకార అధికారి పర్యవేక్షణలో రాజకీయాలకు అతీతంగా ఎలాంటి పైరవీలు లేకుండా ఎకరానికి యాభై వేల రూపాయల చొప్పున లక్ష రూపాయల పరిమితితో రైతులకు రుణాలు ఇవ్వడం జరుగుతుందని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చుతామనీ రుణమాఫీ కానీ రైతులకు త్వరలోనే పూర్తి స్థాయిలో మాఫీ చేస్తామని అన్నారు. రైతులు పండించిన పంటలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమ్ముకోవడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు పంటలను అమ్ముకోవాలని, దొంతి మాధవరెడ్డి అన్నారు. చెన్నారావుపేట పాత సొసైటీ ప్రాంగణంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారదా దేవి, తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. రైతులు పంటలను మార్కెట్ కి తెచ్చే సమయంలో పంటలను ఆరబెట్టి తేవడం వల్ల ఎక్కువ ధర వస్తుంది కావున పత్తి,వరి పంటలను తేమ లేకుండా తీసుకొనిరావాలని అన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొంటుందని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు సెంటర్లలో మాత్రమే రైతులు తమ పంటలను అమ్ముకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో టీ పి సి సి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి, పెండెం రమానంద్, సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణరెడ్డి, మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, చెన్నారావుపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూక్య గోపాల్ నాయక్, నర్సంపేట మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, మొగిలి వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీపీ కేతడి వీరారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు కూస సుదర్శన్ బాదావత్ విజేందర్, సాదు మధుసూదన్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ కోరే కుమారస్వామి, మజ్జిగ రాంబాబు నన్న బోయిన రమేష్ యాదవ్, చెవ్వ వెంకన్న గూడ మహేందర్, బాలు నాయక్, అధికారులు ప్రజాప్రతినిధులు రైతులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర కుటుంబ సర్వేను స్వాగతిస్తున్నాం: పోశం నాగార్జున

**తొలి అక్షరం/తిరుమలాయపాలెం, నవంబర్ 4:** ఈ నెల 6వ తేదీనుండి తెలంగాణ ప్రభుత్వం చేపట్టనున్న సమగ్ర కుటుంబ సర్వేను స్వాగతిస్తున్నామని పాలేరు డివిజన్ బీసీ సంఘం అధ్యక్షులు పోశం నాగార్జున తెలిపారు. ఆదివారం రాత్రి పాలేరులో జరిగిన బీసీ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో అయన మాట్లాడుతూ... అనేక దశబ్ధాలుగా జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య బీసీ జనాభా జనాభా ప్రాతిపధికన రిజర్వేషన్స్ కల్పించాలని చేసిన ఉద్యమాల ఫలితంగానే తాము అధికారంలోకి వస్తే బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, నేడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీసిలకు తగిన న్యాయం చేయాలనే లక్ష్యంతో సమగ్ర కుటుంబ సర్వే చేపట్టడం జరిగిందని అన్నారు. అధికారులు ప్రతీ ఇంటికి వచ్చి వివరాలు సేకరిస్తారని, వారికీ మన వివరాలు అందజేయాలనీ సూచించారు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం గ్రామాలలో కమిటీలను ఏర్పాటు చేస్తున్నారని,ఆ కమిటీలలో బీసీలకు తగిన ప్రాదాన్యత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉప కులాలకు అతీతంగా బీసీ లు అంతా గ్రామాలలో ఐక్యమంత్యంగా వ్యవహరించి తమ హక్కుల సాధనకోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు..... బీసీ సంఘాన్ని మరింతగా భలోపేతం చేసేందుకు బీసీ సంఘం గ్రామ కమిటీల నిర్మాణం చేపడతామని చెప్పారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంఘం పాలేరు నియోజకవర్గ ఇన్చార్జి పోశం నాగార్జున, కూసుమంచి మండల కార్యదర్శి శీలం శ్రీనివాస్ పాలేరు గ్రామ బీసీ నాయకులు దాసరి వెంకన్న ,సాయిని వెంకన్న ,నిమ్మల శ్రీను ,అద్దంకి అప్పన్న ,బత్తుల వుప్పయ్య ,నూకల హుస్సేన్ ,శీలం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# అక్రమ తవ్వకాలు జరుపుతున్న జెసిబి సీజ్

- ట్రాక్టర్లపై చర్యలు తీసుకొని మైనింగ్ అధికారులు
- చర్చనీయాంశంగ మైనింగ్ అధికారుల తీరు



**తొలి అక్షరం/తిరుమలాయపాలెం నవంబర్ 4:** మట్టి అక్రమ తవ్వకాలు, రవాణాపై తొలి అక్షరం దినపత్రికలో న్యూస్ లో ప్రచురితమైన కథనంతో అధికార యంత్రాంగం కదిలింది. మంగళవారం మైనింగ్ గనులు,భూగర్భ శాఖఅధికారి ఏడి సాయినాథ్ ఆదేశాల మేరకు మైనింగ్ టెక్నికల్ అసిస్టెంట్ మహమ్మదాపురం గ్రామ రెవెన్యూలో మట్టి అక్రమ త్రవకాలకు సంబంధించి దాడులు నిర్వహించారు. త్రవ్వకాలలో జెడ్ సి బి తో పాటు ట్రాక్టర్లను గుర్తించారు. వెంటనే జెసిబి సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించారు. కానీ జెసిబి తో పాటు ఉన్న ట్రాక్టర్లను వదిలేయడం ఏంటని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. జెసిబి పై కేసు నమోదు చేసి సమందికులపై తగిన చర్యలు చేపట్టే విధంగా పోలీసు వారికి చెప్పినట్లు వారు తెలియజేశారు. ప్రభుత్వ భూమిలో గాని, సొంత భూమిలో కానీ మట్టిని తరలించినట్లయితే మైనింగ్ అధికారుల పరిమిషన్ తీసుకోవాలని లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారన్నారు.**భూమి నాదంటూ..రైతు కటకం శ్రీనివాసులు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు.** అక్రమంగా రైస్ మిల్లు కు తరలిస్తున్న మట్టి నా సొంత భూమిలోదని అంటూ రైస్ మిల్లు వ్యాపారిపై అతని సోదరుడు కటకం శ్రీనివాసులు జిల్లా కలెక్టర్కు ఫిర్యాదుచేసాడు. సర్వే నెంబర్ లు 146,147,156,157,లలో అతనికి వారసత్వంగా వచ్చినటువంటి భూమి ఉన్నదని ఇప్పటివరకు కూడా క్రయవిక్రయాలు జరపలేదని ప్రస్తుతం కోర్టులో కేసు నెంబర్ ఓస్. నెంబర్ 691/2022 సదర్ కోర్టులో పెండింగ్లో ఉన్నదని ఆయన పేర్కొన్నారు.

# ఒంటి పూట బడులపై పునరాలోచించాలి..

- ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఎపిడీఓకు వినతి..



**తొలి అక్షరం/నెల్లికుదురు,నవంబర్ 4:** ఒంటి పూట బదులపై ప్రభుత్వం పునరాలోచించావలసిన అవసరం ఎంతైనా ఉందని ఆయా ఉపాధ్యాయ సంఘాల నేతలు స్థానిక ఎంపిడిఓ బాలరాజు వినతి పత్రం అందజేశారు.గురు వారం అనంతరం మండల కేంద్రంలో విలేఖర్లతో వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర సర్వే ఎన్యుమరేటర్లు గా విధుల కేటాయింపులో ప్రాథమిక పాఠశాల లో పనిచేసే ఉపాధ్యాయులను, ప్రధానోపాధ్యాయులను మాత్రమే తీసుకోవడం జరిగిందన్నారు. దీనివల్ల ఆయా ప్రాథమిక పాఠశాలలు ఒక పూట సెలవు ప్రకటించాల్సిన అవసరం ఏర్పడిందని,ఇది ప్రభుత్వ పాఠశాలల మనుగడను మరింత ప్రశ్నార్థకంగా మార్చే చర్యగా భావిస్తున్నామన్నారు. ఉదయం పూట బడి నడిపిమధ్యాహ్నము సర్వే నిర్వహించడంతో గ్రామంలోని కుటుంబ పెద్దలు వారి వారి పనులలో నిమగ్నమై మెనీ మోర్ ట్లకు అందుబాటులో ఉండరని పైగా మధ్యాహ్నం పూట పిల్లలు ఇంటికి వెళ్లడం వల్ల చాలా ఇబ్బందులు పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల పని వేళలకు ఆటంకం కలగకుండా రెండు పూటలా బడి నడిచేలా ప్రత్యామ్నాయం అన్వేషించాలని మండల విద్యాశాఖ అధికారి,స్థానిక ఎంపీడీవో ఇట్టి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ల వలసినావసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిపిటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి. సైదుల్ పాషా, డిటిఎఫ్ జిల్లా కౌన్సిలర్ పెరుమాండ్ల యాదగిరి, టిపిటిఎఫ్ ,డిటిఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సంగ శ్రీనివాస్ ,మండల రాజు,మధుసూదన్, కే. ప్రభాకర్ ,రాజయ్య, సుధాకర్, రాజశేఖర్,దేవేందర్, రాగి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాఘవ రెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం..!!

- మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సత్యపాల్ రెడ్డి..



**తొలి అక్షరం/నెల్లికుదురు,నవంబర్ 4:** మాజీ సర్పంచ్ పొలం రాఘవ రెడ్డి కుటుంబానికి అండగా ఉంటాంమని జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నాయిని సత్యపాల్ రెడ్డి భరోసాఇచ్చారు.నెల్లికుదురు మండలం శ్రీరామగిరి గ్రామం వెంకటాపురంచెందిన పొలం రాఘువ రెడ్డి,దశదిన కర్మలకు హాజరై లినాయిని సత్యపాల్ రెడ్డి మాట్లాడుతూ రాఘవరెడ్డి కుమారుడు పొలం వెంకట్ రెడ్డి కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసానిచి,రాజకీయ రంగంలో మచ్చ లేని నాయకునిగా ఎదిగి ప్రజా సేవాలోతనదై ముద్ర వేసుకుని మంచి పరిపాలన దక్షకునిగా రాఘవ రెడ్డి కి సాటి రారని,కుటుంబం మనో నిగ్రహం కొల్పోకూడదని నిగ్రహంగా ఉండాలని కుటుంబ సభ్యులను ఓదార్చారు ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు గుగులోత్ బాలాజీ నాయక్ ,మాజీ వైస్ ఎంపిపి జెల్ల వెంకటేష్, గ్రామ సీనియర్ నాయకులు డోనికని శ్రీనివాస్, గంజి గోవర్ధన్,మండల నాయకులు గంకిడి ఎల్లారెడ్డి,తొర్రూర్ మార్కెట్ డైరెక్టర్ భాస్కర్ నాయక్,ఆరెపల్లి రాంచంద్రు,దాసరి ప్రకాష్, మాదరి ప్రశాంత్,ఆరెపల్లి వెంకన్న,ముకేశ్ తదితరులు పాల్గొన్నారు.

# దాతృత్వాన్నిచాటుకున్న డోర్నకల్ పోలీసులు..

**తొలి అక్షరం/డోర్నకల్ నవంబర్ 4:**డోర్నకల్ మండలం గొల్లచెర్ల గ్రామంలో రాములమ్మ అనే వృద్ధురాలు నా అన్నవారు లేక ఒంటరి జీవితాన్ని గడుపుతుంది.వృద్ధురాలి పరిస్థితి దహినీయంగా ఉందని తెలుసుకున్న డోర్నకల్ సీఐ రాజేష్,ఎస్సై వంశీధర్ స్వయంగా వృద్ధురాలు ఇంటికివెళ్లి నిత్యవసర సరుకులు అందజేశారు.ఎల్లప్పుడు మా సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు. పోలీసుల అందించిన సహాయ సహకారాలను చూసిన మండల ప్రజలు వారిని అభినందించారు.



# వాహనాల తనిఖీలు చేపట్టిన ఎస్సై సురేష్




**తొలి అక్షరం/నరసింహుల పేట, నవంబర్ 4:** ఖమ్మం వరంగల్ జాతీయ ప్రధాన రహదారిలో ఎస్సై మాలోతు సురేష్ ఆధ్వర్యంలో సోమవారం పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. సరైన అనుమతి పత్రాలు లేని వాహనాలు, నంబర్ ప్లేట్స్ తప్పుగా వున్న వాటిని, నంబర్ ప్లేట్స్ లేని వాహనాలను తనిఖీ చేసి యజమానులకు జరిమానా విధించారు. ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు అన్ని రకాల అనుమతి పత్రాలు వెంట ఉంచుకోవాలని ట్రాఫిక్ నియమాలు తప్పని సరిగా పాటించాలనిద్విచక్ర వాహనం నడిపేటప్పుడు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని కార్లు నడిపే వారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలని చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని వాహనదారులు పెండింగ్ ఉన్న ఈ చలాన్లను వెంటనే చెల్లించాలని సూచించారు. ఎస్ఐ వెంట కానిస్టేబుల్ రమేష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# చైల్డ్ హెల్ప్ లైన్‌కు బాలుడి తరలింపు




**తొలి అక్షరం/నరసింహుల పేట,నవంబర్. 04:** నర్సింహులపేటలోని బాసు తండా గ్రామ పంచాయితీ శివారు దాసు తండకు చెందిన 13 సంవత్సరాల బాలుడు పాఠశాలకు వెళ్లకుండ తిరుగుతున్నాడని చెడు వ్యసనాలకి అలవాటు పడ్డాడని 1098 కి సమాచారాన్ని అందించడంతో చైల్డ్ హెల్ప్ లైన్ సూపర్వైజర్ కళ్యాణి, ప్రభు లతో పాటు ఎస్ జె పి యు కానిస్టేబుల్ ఆమని 1098 వాహనం లో బాలుడి ఇంటికి వెళ్లి బాలుడికి మరియు తల్లిదండ్రులకి కౌన్సిలింగ్ నిర్వహించిన తర్వాత బాలుడిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పరిచి వారి ఆదేశాల మేరకు పాఠశాలలో రీ అడ్మిషన్ చేయించడం జరుగుతుందని ఈ 1098 నెంబరు 24/7 ఆపదలో ఉన్నటు వంటిబాలబాలికలకుఅందుబాటులో ఉంటుందని వారు అన్నారు.

# కార్తీక మాసం ప్రత్యేక పూజలు



**తొలి అక్షరం/పాపన్నపేట,నవంబర్ 4:** కార్తీక మాసం సోమవారం సందర్బంగా మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గా క్షేత్రంలో అర్చకులు శంకర్ శర్మ,పార్థివ శర్మ గంగమ్మ కి గంగహారతి ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అలాగే వనదుర్గమ్మ ఆలయంలో మహా లింగం రూపంలో ప్రత్యేక దీపారాధన చేశారు.

# మూఢనమ్మకాలు నమ్మవద్దు



**తొలి అక్షరం/పాపన్నపేట,నవంబర్ 4:** సైన్స్..మూఢనమ్మకాలు అనే అంశం పై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం పాపన్న పేట జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నర్సింలు అధ్యక్షత న విజ్ఞానవేదీక నరేష్ విద్యార్థులకు మూఢనమ్మకాలు నమ్మవద్దు, సైన్స్ ను మాత్రమే నమ్మలని ప్రయోగ రూపంలో చూపెట్టి విద్యార్థులకు వివరించారు.విద్యార్థులలో ఉన్న మూఢనమ్మకాల పై ఉన్న అనుమానాలను నివృత్తి చేసాడు.అలాగే విద్యార్థులకు పర్సనాలిటీ డెవలప్మెంట్ క్లాస్ తీసుకొని విద్యార్థులకు లక్ష్యం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా ఏఎస్ఐ సంగన్న,అధ్యాపకులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మండల అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలి: మంత్రి పొంగులేటి

- పాలేరు అసెంబ్లీ పరిధిలో పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మాణ పనుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- వెటర్నరి డాక్టర్లు ప్రతి గ్రామానికి వెళ్ళి పశువులకు వైద్యం అందించాలి
- డిసెంబర్ చివరి లోపు రుణమాఫీ పెండింగ్ నిధులు విడుదల
- గ్రామసభల ద్వారా పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక
- తిరుమలాయపాలెం మండల అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్షించిన మంత్రి పొంగులేటి






**తొలి అక్షరం/తిరుమలాయపాలెం, నవంబర్ 4:** మండలంలో అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.సోమవారం మంత్రి కూసుమంచి లోని తన క్యాంప్ కార్యాలయంలో తిరుమలాయపాలెం మండల అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్షించారు. ఈసందర్భంగా గ్రామాల వారీగా ఉన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనుల వివరాలను ప్రజా ప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకొని వచ్చారు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి అధికారులకు పలు సూచనలు జారీచేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, వరదల వల్ల నష్టపోయిన కాల్వల మరమ్మత్తు పనులు వెంటనే చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పైనంపల్లి గ్రామంలోని పాఠశాల వద్ద సిసి రోడ్డు మంజూరు చేయాలని కోరగా, జనవరి మాసంలో మంజూరు చేస్తామని మంత్రి అన్నారు. ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ శాఖ క్రింద పాలేరు అసెంబ్లీ పరిధిలో సెంటీమీటర్ కూడా వదిలిపెట్టకుండా పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. డబుల్ రోడ్డు నిర్మాణ పనుల సందర్భంగా ఎక్కడైనా ఇళ్లు పోతుంటే ఇందిరమ్మ ఇళ్ల క్రింద మంజూరు చేస్తామని, అవసరమైతే ఇంటి పట్టాలు కూడా మరోచోట అందిస్తామని, రోడ్డు నిర్మాణ పనులకు ప్రజలు సహకరించేలా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు.గ్రామాలలో జరిగే అభివృద్ధి పనులకు చెల్లింపులు సైతం మార్చి నాటికి పూర్తి చేస్తామని అన్నారు.పాలేరు అసెంబ్లీలోని నీటి వనరులలో పూర్తి స్థాయిలో చేప పిల్లలను విడుదల కార్యక్రమం వారాంతం నాటికి పూర్తి కావాలని అన్నారు. వెటర్నరి డాక్టర్లు తమ పరిధిలోని గ్రామాలను ప్రతి వారం కనీసం 3 సార్లు పర్యటించాలని అన్నారు. గీత కార్మికులకు అవసరమైన మేర కాటమయ్య రక్షణ కవచ కిట్లను పంపిణీ చేయాలని మంత్రి ఆదేశించారు. ఎం. వెంకటాయ పాలెంలో రైతులు డిడి లు చెల్లించారని వెంటనే ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేయాలని అన్నారు.రైతులకు వరద సహాయం అందించేందుకు ఎకరానికి 600 రూపాయల లంచం ఇవ్వాలని కొంత మంది అధికారులు అడిగిన్నట్లు సమాచారం అందిందని, దీనిపై సమగ్రంగా విచారించి నివేదిక సమర్పించాలని మంత్రి ఆర్డీఓను ఆదేశించారు. ఇందులో పాల్గొన్న ప్రతి అధికారిపై చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. డిసెంబర్ చివరి నాటికి రైతు రుణమాఫీ పెండింగ్ నిధులు విడుదల చేయడం జరుగుతుందని, జనవరి నెల నుంచి రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం సరఫరా చేస్తామని అన్నారు. సమగ్ర కుటుంబ సర్వే ద్వారా ఫ్యామిలీ డిజిటల్ కార్డులు జారీ చేస్తామని, దీని ద్వారానే రేషన్, రుణమాఫీ, రైతు భరోసా ఇందిరమ్మ ఇళ్లు వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు ఉంటుందని అన్నారు.ఇందిరమ్మ ఇళ్లను పేదలకు మాత్రమే పంపిణీ చేయాలని, గ్రామసభల ద్వారా పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు ఉంటుందని అన్నారు. ఒక అనర్హుడికి ఇచ్చినా ప్రభుత్వ లక్ష్యం నిర్వీర్యం అవుతుందని, ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకోవాలని అన్నారు. 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇళ్ల నిర్మాణం చేయాలని మంత్రి అన్నారు. ప్రభుత్వ స్థలాల్లో కబ్జాలో పేదలు ఉంటే పట్టాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని, సంపన్నులు, రాజకీయ ప్రభావితం చేసే వారు కబ్జా చేసి ఉంటే వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని అన్నారు.తహసీల్దార్లు, ఎంపీడీఓలు ప్రతివారం కనీసం రెండు సార్లు ప్రతి గ్రామానికి వెళ్ళాలని, ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి సూచించారు. అవసరమున్న చోట విద్యుత్ పోల్స్ ఏర్పాటు, ట్రాన్స్ఫార్మర్ లను ఏర్పాటు చేయాలని, లూజ్ వైర్లను సరి చేయాలనీ, గ్రామ కార్యదర్శులు, హెల్త్ సెక్రటరీ లు తాము పనిచేస్తున్న గ్రామంలోనే స్థానికంగా అందుబాటులో ఉండాలని, గ్రామ పంచాయతీ భవనం, అంగన్వాడి భవనాల నిర్మాణానికి గాను చర్యలు తీసుకోవాలని, ఉన్న అంగన్వాడి భవనాల్లో చేయాల్సిన మైనర్ మరమ్మత్తులను వెంటనే చేపట్టాలని, అలాగే గ్రామ పంచాయతీల్లో టాయిలెట్ ల నిర్మాణం చేపట్టాలని, మండలంలోని ప్రతి గ్రామంలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా శాశ్వత ఏర్పాట్లు చేసి పూర్తి స్థాయిలో త్రాగునీరు అందించాలని, క్రీడా ప్రాంగణాలు పరిశుభ్రంగా, ఉపయోగకరంగా ఉండేందుకు గాను గ్రామంలోని యువకులతో ఒక కమిటీ ఏర్పాటు చేసి క్రీడా ప్రాంగణాల నిర్వహణ పర్యవేక్షణ పకడ్బందీగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, తిరుమలాయపాలెం తహసీల్దార్ పీవీ రామకృష్ణ ఎంపీడీవో షేక్ సిలార్ సాహెబ్ ఎంపీ ఓ సూర్యనారాయణ ఏపీఎం అలివేలుమంగ ఎం ఈ ఓ శ్రీనివాసరావు పొంగులేటి క్యాంపు ఇన్చార్జి తంబూరి దయాకర్ రెడ్డి కాంగ్రెస్ జిల్లా నాయకులు రామ సహాయం నరేష్ రెడ్డి చావా శివరామకృష్ణ మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాధ బాబు వైస్ చైర్మన్ వనవాసం నరేందర్ రెడ్డి కొప్పుల అశోక్ బెల్లం శ్రీనివాస్ బోడ మంగీలాల్ గంధ్ర గోపాలరావు, దాస్ సాయికిరణ్, మిరియాల విక్రమ్ రెడ్డి , వెన్నం సుధాకర్ రెడ్డి, కొప్పుల రాంరెడ్డి, గుండ రఘురాం రెడ్డి ,కమటం లక్ష్మణ్ ,ఉన్నం రాజశేఖర్ , పత్తి నాగేశ్వరరావు, నీరుడు లాజర్, లచ్చు మల్ల, శేఖర్, దామళ్ళ ఉపేందర్ ,తాటికొండ కిరణ్ ,పోట్ల కిరణ్, బుద్ధ కనకయ్య కట్కూరి శ్రీనివాస్ రెడ్డి, మోరపాక నాగయ్య, ఎస్.కె మన్సూర్ తడ బోయిన కృష్ణ , ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు లంజపల్లి శ్రీనివాస్ , ఉప్పునూతల నాగేశ్వరరావు హలవత్ శ్రీనివాస్ దొడ్డ గురవయ్య చామకూరి శ్రీనివాస్ దూదిమెట్ల వెంకట్ చిప్పరపల్లి రమేష్ వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులుపాల్గొన్నారు.

## నెక్కొండలో పత్తి సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన దొంతి




**తొలిఅక్షరం/నెక్కొండ, నవంబర్ 4:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన నర్సంపేట శాసనసభ సభ్యులు దొంతి మాధవ రెడ్డి ఈ కార్యక్రమంలో రైతులు పత్తి గాని ఇతర ధాన్యాలు గాని మార్కెట్కు తీసుకువచ్చిన సమయంలో మార్కెట్ నియమ నిబంధనకు అనుగుణంగా తీసుకొని రావాలని తేమశాతాన్ని అతి తక్కువగా ఉండే విధంగా చూసుకోవాలని తెలియజేయడం జరిగినది. పిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కీ అశోక్, రావుల మైపాల్, శివ మరియు చిన్న కొర్పోలు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగపురి చంద్రమౌళి గౌడ్, చింతల వేణుగోపాల్, కొయ్యడా రాజు కాసాని అశోక్, పులి రంజిత్, కొయ్యడ ఐలయ్య, బత్తిని ఎల్లయ్య, ఆత్మకూరు సారంగపాణి, బానోతు వెంకన్న మరియు ఇతర కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## నెక్కొండ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో రుద్రాభిషేకాలు



**తొలిఅక్షరం/నెక్కొండ, నవంబర్ 4:** వరంగల్ జిల్లా నెక్కొండలోని శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయం సోమవారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. కార్తీక మాసంలో తొలి సోమవారం కావడంతో విక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. రుద్రాభిషేకాలలో పాల్గొనేందుకు భక్తులు ఆసక్తి చూపడంతో రద్దీ పెరిగింది. భక్తుల శివనామస్మరణతో శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. వివిధ రకాల అభిషేక ద్రవ్యములతో స్వామివారికి అభిషేకం చేశారు. ఆలయ అర్చకులు బివిఎన్ శాస్త్రి ఆధ్వర్యంలో తొలుత గణపతి పూజ చేసి శివుడికి పంచామృతములతో అభిషేకం చేశారు. ఉపవాస దీక్షలో ఉన్న భక్తులు స్వామివారిని యధాశక్తిగా అభిషేకించి మొక్కులు చెల్లించుకున్నారు. బిల్వార్చనలు, శివార్చనలు సాగాయి.ద

## కార్తీక సోమవారం వేళ.. భక్తులతో కిటకిటలాడుతున్న శివాలయం



**తొలి అక్షరం/నరసింహుల పేట, నవంబర్ 4:** మండల కేంద్రంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి ప్రసన్న ఆంజనేయస్వామి శివాలయంలో సోమవారం ఘనంగా కార్తీక మాస వేడుకలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు దేవేందర్ శర్మ తెలిపారు అనంతరం ఆయన.మాట్లాడుతూకార్తీక మాసంపురస్కరించుకొని వేలాదిమంది భక్తులు ప్రముఖ ఆలయాలను సందర్శించారు. కార్తీకమాసం తొలి సోమవారం కావడంతో వేకువజాముననే ప్రధాన ఆలయాల్లోని ఆకేరు వాగులో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. గంటల కొద్ది క్యూలో నిల్చొని శివాలయం ఆలయాల్లో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. నవంబరు 2 నుంచి డిసెంబరు ఒకటో తేదీ వరకు కార్తీక మాసోత్సవాలు ఘనంగా జరగనున్నాయి. ఆలయ అర్చకులు తెలిపారు తెల్లవారుజామున 5గంటల నుంచి రాత్రి 9గంటల వరకు నిరంతర దర్శనం కల్పించడానికి ఆలయ కమిటీ నెంబర్లు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈసందర్భంగా భక్తులు దర్శించుకుని భక్తి శ్రద్ధలతో మొక్కులు సమర్పించుకుంటున్నారు. మహిళ భక్తులు ఆలయ పరిసరాల్లో కార్తీక దీపాలను వెలిగించారు. ఆలయ పరిసరాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగిపోయాయి. ఉసిరి చెట్ల కింద దీపాలు మహిళలు వెలిగించారు పాడిపంటలు చల్లగా ఉండాలని మహిళలు తమ కోరికలు కోరుకున్నారు కార్తీక మాసం సందర్భంగా నూతన వాహనములు కు పూజలు నిర్వహించారు.

## అయ్యో పాపం అమ్మడెవ్వరో..??

- అమ్మాయి అడ్రస్ తెలిస్తే ఆచూకీ చెప్పండి..



**తొలి అక్షరం/మహబూబాబాద్, (నెల్లికుదురు) నవంబర్ 4:** ఏ కన్నబిడ్డో తల్లిదండ్రులు ఎంత ఏడుస్తూన్నారో , కాని అబిడ్డ ఇక్కడ ఉందని వారికి తెలియదు.పై ఫోటోలో కనబడుతున్న అమ్మాయికి మతి స్థిమితం లేదు, ఆమె వివరాలు ఏమి, చెప్పలేకపోతున్నది. ప్రస్తుతం ఆ అమ్మాయి మహబూబాబాద్ లోని సఖి సెంటర్ లో ఉన్నది. అమ్మాయి వివరాలు తెలిసినవారు, ఎస్సై కేసముద్రం 8712656954,సిఐ మహబూబాబాద్ రూరల్,8712656950పై నంబర్లకు సంప్రదించగలరు.

## బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేసిన మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో (సాంబ) నవంబర్ 04:** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన పందుల వెంకటేశ్వర్లు (55) ఇటీవల అప్పుల బాదతో ఆత్మహత్య చేసుకొని చనిపోయిన రైతు కుటుంబానికి సహాయంగా తొర్రూర్ మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్ 50కిలోల బియ్యాన్ని అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కష్టకాలంలో ఆత్మస్థైర్యంతో జీవించాల్సినటువంటి రైతు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకొని చనిపోవడం దురదృష్టకరం , ఆపదలో ఉన్నటువంటి కుటుంబానికి చేయూతని ఆరాల్సిందిగా గ్రామస్తులను ఈ సందర్భంగా కోరారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు సీనియర్ మాజీ ఎంపీటీసీ సోమలింగం,మాజీ సర్పంచ్ లు పందుల యాకయ్య ,ధరావత్ రవి, మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు అంకుస్ ,పులి వెంకన్న, పెద్ద బోయిన రామ్మూర్తి, పయ్యావుల రామ్మూర్తి,తొర్రూరు సోషల్ మీడియా అధ్యక్షులు ఎర్రం రాజు, బీ ఆర్ ఎస్ పార్టీ గ్రామ కార్యదర్శి భాస్కర్, మాజీ ఎస్ఎంసి చైర్మన్ పులి సోమన్న, మాజీ వార్డ్ నెంబర్ పులి రఘుపతి , హెచ్ యాకయ్య, పులి విజయ్, పందుల వెంకట సోములు, పందుల రవి, శీలం రవీందర్, కనకయ్య, పందుల సైదులు, తండ వంశీ, ప్రభుత్వ ఉపాధ్యాయులు పందుల వెంకటేశ్వర్లు,పందుల యాకయ్య,గ్రామస్తులు , కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## పోలీస్ ఆధ్వర్యంలో మూఢనమ్మకాలపై అవగాహన: ఎస్సై ఝాన్సీ




**తొలి అక్షరం/చిన్న గూడూరు, నవంబర్ 4:** చిన్న గూడూరుమండలం లోని ఉగంపల్లి గ్రామంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు.ప్రజలకు మూఢనమ్మకాలు, సైబర్క్రైంపై సైబరాబాద్ పోలీస్ జాగృతి కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎస్సై ఝాన్సీ హాజరయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఎక్కడ చూసిన ఆన్లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని ప్రజలందరూ ఆన్లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. మూఢ నమ్మకాల పేరుతో గ్రామాల్లో ప్రజలు సమయాన్ని వృథా చేసుకుంటూ మోసపోతున్నారని తెలిపారు.గ్రామాల్లో కొత్త వ్యక్తులు ఎవరైనా అనుమానంగా తిరుగుతున్నా, ఎలాంటి ఆపద ఉన్నా .1930.100కి ఫోన్ చేస్తే సకాలంలో పోలీసులు వస్తారని తెలిపారు. కళాజాత బృదం నాటిక రూపంలో మూఢనమ్మకాలు, ఆన్లైన్మోసాలు, ఫోన్లో అపరిచిత వ్యక్తుల పరిచయాల గంజాయి. గుట్కా. బాల్య వివాహాలు.వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాజాత ప్రోగ్రాం బృందం సతీష్. కుమార్. తిరుపతి. రమేష్ గ్రామ ప్రజలు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## చిన్నారులను ఆశీర్వదించిన నర్సంపేట శాసనసభ్యులు దొంతి



**తొలి అక్షరం/నెక్కొండ, నవంబర్ 4:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రానికి చెందిన ఈదునూరి బిక్షపతి లలిత–కూతుర్ల శారీ ఫంక్షన్ కి హాజరై చిన్నారులు శరణ్య,జస్మిక లను ఆశీర్వదించిన నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి ఈ కార్యక్రమంలో నర్సంపేట పిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి మండల పార్టీ అధ్యక్షులు భక్కీ అశోక్, పట్టణ పార్టీ అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్, నర్సంపేట కోర్టు ఎజిపి బండి శివకుమార్, మండల నాయకులు కొల్లి వెంకట సుబ్బారెడ్డి,చల్ల శ్రీపాల్ రెడ్డి,ఈదునూరి సాయికృష్ణ,మార్కెట్ కమిటీ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సింగం ప్రశాంత్, పోలిశెట్టి భానులు చిన్నారులను ఆశీర్వదించారు.

## మాజీ సర్పంచులు ముందస్తు అరెస్ట్

**తొలి అక్షరం/పాపన్నపేట, నవంబర్ 4:** గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచులు వెచ్చించిన నిధులని పెండింగ్ బిల్లుల రూపంలో చెల్లించడంలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతను ప్రశ్నించే కార్యక్రమంలో భాగంగా సర్పంచులు ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిచ్చారు.ఈసమావేశానికి హాజరు కావడానికి హైదరాబాద్ వెళ్లిన గ్రామ మాజీ సర్పంచ్ కుమ్మరి జగన్నాథం ని కొండాపూర్ లోని వారి స్వగృహంలో సోమవారం ఉదయం పోలీస్ లు గృహ నిర్బంధం చేశారు.అనంతరం గచ్చిబౌలి ఠాణా కి తరలించారు.కాగా పాపన్నపేట గ్రామ మాజీ సర్పంచ్ గురుమూర్తి గౌడ్ ని ముందస్తు అరెస్ట్ చేశారు.ఈ అరెస్ట్ లని మండల భారాస నాయకులు బాబాగౌడ్,సొంగ దుర్గయ్య తీవ్రంగా ఖండించారు.



# ఏడుపాయలను శాసిస్తున్న సూర్య భాయ్

**● అతడి ఆగడాలకు అడ్డే లేదు ● అతడికి అడ్డొస్తే బదిలీవేటే ● బాయ్ చెప్పు చేతల్లో ఉన్నతాధికారులు**

**● ఏడుపాయలలో బినామీ పేరుతో రెస్ట్ హౌస్ నిర్మాణం**








**తొలి అక్షరం/పాపన్నపేట, నవంబర్ 4:** తాను తెలంగాణలోనే ప్రఖ్యాతి చెందిన ఏడుపాయల దేవదాయ శాఖలో అతడు ఒక ఒక చిరుద్యోగి. కానీ ఏడుపాయల ఉద్యోగులతో పాటు ఈ ఓ వరకు అతడు చెప్పింది వినాల్సిందే. లేకుంటే రాజకీయ పలుకుబడి ఉపయోగించి, మెమోలు ఇప్పిస్తాడు, లేదంటే బదిలీ వేటు వేయిస్తాడు, ఈ ఓ సైతం అతని కనుసన్నల్లో నడవాల్సిందే, అతను ఎవరో కాదు బాయ్ సూర్య బాయ్, ఈ పేరు చెబితేనే ఉద్యోగులంతా గజగజ వనకాల్సిందే, ఏమన్నా అంటే తాను యూనియన్ నాయకున్ని అంటాడు, లేదంటే లోకల్ అని దబాయిస్తాడు, ఇటీవల ఈవోగా పనిచేసిన శ్రీనివాస్ అతడు చెప్పినట్టు వినకపోవడంతో పకడ్బందీ స్కెచ్ వేసి అతడిని బదిలీ చేయించడం లో సఫలీకృతం అయ్యాడు. ఎదుటివారిని చిత్తు చేయడానికి ఇతగాడుఎత్తులు వేయడంలో దిట్ట. ఇతడు హైదరాబాదులోని వినాయకుడి టెంపుల్ లో తాత్కాలిక ఉద్యోగిగా 2002లో బాధ్యతలు చేపట్టాడు. అనతి కాలంలోనే పైరవీతో ఏడుపాయల ఆలయానికి డిప్యూటేషన్ పై వచ్చాడు, అప్పటినుండి ఏడుపాయలను 20 ఏళ్లుగా ఏకచత్రాధిపత్యం గా శాసిస్తున్నాడు, ఏడుపాయల ఈవో సైతం ఏదైనా ఉంటే సూర్య బాయ్ ని అడిగే చేస్తున్నాను అంటున్నారు, అంటే అతని ఆధిపత్యం ఎలా ఉందో అర్థం అవుతుంది, ఏడుపాయలలో ఒక పెద్ద రెస్ట్ హౌస్ నిర్మించి బినామీ పేరుతో అద్దెలకు ఇస్తు లక్షలు సంపాదిస్తున్నాడు, ఏడుపాయల లో దాతలు నిర్మించిన సత్రాలు బాగుంటే తమ రెస్ట్ హౌస్ ను భక్తులు అద్దెకు తీసుకోరన్న ఉద్దేశంతో, దాతలు నిర్మించిన సత్రాలను మరమ్మతు చేయించాక పాడుబడ్డట్టు చేస్తున్నాడు. దాతల సత్రాలకు కిటికీలు ఊడిపోయిన, కరెంటు బోర్డులు విరిగిపోయిన, బాత్రూంలకు డోర్లు లేకపోయినా వాటిని మరమ్మతు చేయించడానికి అతడి మనసు ఒప్పుకోదు. అవి బాగుంటే భక్తులు తమ గదులను అద్దెకు తీసుకోరు అన్నది అతని ఉద్దేశం. అంతేకాకుండా ఏడుపాయల్లో నాలుగు దుకాణ షెడ్లను బినామీ పేర్లపై ఏర్పాటు చేసుకొని వాటిని సైతం అద్దెకిస్తూ డబ్బులు సంపాదిస్తున్నాడు. ప్రస్తుతం ఉన్న ఈవో ఏడుపాయలలో నిబంధనలకు ఆతీతంగా అద్దెకిస్తున్న 25 దుకాణాల డబ్బాలను సీజ్ చేయగా ఇతడివి మాత్రం ముట్టుకోలేదు, అంటే సూర్య భాయ్ హల్చల్ ఎలా ఉందో అర్థమవుతుంది. అంతేకాకుండా ఇతడి దుకాణాలకు తాళం వేయకుండా ముందుచూపుతో వ్యూహాత్మకంగా షట్టర్లు సైతం ఏర్పాటు చేయలేదు. ప్రతి సంవత్సరం పని బాటల వరకు ఏదైనా పని చేస్తే డబ్బులు ఇవ్వడం ఆనవాయితిగా వస్తుంది. ఇటీవల వారికి డబ్బులు ఇవ్వొద్దు అని ఈవోకు చెప్పడం తో, ఈవో డబ్బులు ఇవ్వడానికి నిరాకరించాడు. దీంతో పనిభాటాల వారికి ఈవోకు మధ్య పెద్ద ఎత్తున వాగ్వివాద%శీ% జరగడానికి కూడా సూర్య భాయ్ ఏ కారణం, యేది ఏమైనా అధికారులను గుప్పిట్లో పెట్టుకుని కిందిస్థాయి ఉద్యోగులను భయభ్రాంతులకు గురి చేస్తు, ఉద్యోగం చేసే చోటే వ్యాపారం చేస్తూ లక్షలు గడుస్తున్నా సూర్య భాయ్ పై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలి

**● జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్**



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్4:** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలనీ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు.సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో అన్ని విభాగాల అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి సంబధిత శాఖల అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.ఈ సోమవారం బయ్యారం మండలం కు చెందిన ధారావత్ శంకర్ తనకు సోలార్ ప్రాజెక్టు కింద పంపు, మోటార్ సెట్ మంజూరు కి దరఖాస్తు చేశారు.కేసముద్రం మండల కేంద్రానికి,ఐలన్న కట్టయ్య, వెంకన్న చెందిన యాదవ సంఘం వారు కమ్యూనిటీ హాల్ నిర్మాణం స్థలం మంజూరు కోసం దరఖాస్తు చేశారు. ఖానాపురంకు చెందిన ముడుపు రాజిరెడ్డి, తన భూమిలోకి అక్రమంగా వస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని దరఖాస్తు చేసుకున్నారు. మహబూబాబాద్ మండలం పర్వతగిరి కి చెందిన ఆమునురి వెంకన్న తనకు దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయుటకు దరఖాస్తు చేశారు.బయ్యారం మండలం బాలాజీ పేటకు చెందిన ధరావత్ లక్ష్మి తనకు రుణమాఫీ వర్తింపచేయాలని దరఖాస్తు చేసుకున్నారు.డోర్నకల్ మండలం ములకలపల్లి కి చెందిన బండ్ల సూరమ్మ, తన వ్యవసాయ భూమికి నీటి వసతి కొరకు ఎస్సీ కార్పొరేషన్ నుండి సహాయం చేయుటకు దరఖాస్తు చేశారు.అందులో రెవెన్యూ శాఖ 34, వ్యవసాయ శాఖ 4, గ్రామీణ అభివృద్ధి 6, ఉపాధి కల్పన 3,ఇలా తదితర విభాగాలకు చెందిన మొత్తం ( 73 ) ప్రజావాణి దరఖాస్తులు వచ్చాయని, అట్టి దరఖాస్తులను సంబంధిత విభాగాలకు, శాఖలకు పంపడం జరిగిందని వాటి పరిష్కారం దిశగా వారికి తగు ఆదేశాలు జారీ చేశామని అన్నారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్డిఓ ప్రాజెక్టు డైరెక్టర్ మధుసూదన్ రాజు, డిసిఓ వెంకటేశ్వర్లు, ఏడి ల్యాండ్ సర్వే నరసింహమూర్తి, డిఏఓ విజయనిర్మల, డిపిఓ హరిప్రసాద్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహస్వామి, డిడి గ్రౌండ్ వాటర్ వి.సురేష్, డివిహెచ్ఓ డాక్టర్ కిరణ్ కుమార్, డిహెచ్ఓ జి. మరియన్న, ఆర్ అండ్ బీ ఈఈ భీమ్లా నాయక్, జిల్లా మైనింగ్ అధికారి ఏ. వేంకటరమణ, మెప్మా పిడి విజయ, ఎంప్లాయ్మెంట్ అధికారిని రజిత, మైనారిటీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, అన్ని బాగాల అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జాతీయ కార్యక్రమాలపై సమీక్ష



**తొలి అక్షరం,రాష్ట్ర ప్రతినిధి/నవంబర్4:** ఐడిఓసి లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్, ఆప్తాలమిక్ ఆఫీసర్స్, సూపర్వైజర్ స్టాఫ్ కి జాతీయ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి మురళీధర్ మాట్లాడుతూ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలైన, మెటర్నల్ చైల్డ్ హెల్త్, కీటక జనిత వ్యాధులు, అసంక్రమిత వ్యాధిలు, విస్తృత వ్యాధి నిరోధక టీకాలు, కుష్టి వ్యాధి, క్షయ వ్యాధి, ఎచ్ఐవి ఎయిడ్స్, కుటుంబ నియంత్రణ కార్యక్రమాలలో భాగంగా గర్భిణీ స్త్రీల నమోదు 12 వారాలలో నమోదు చేయాలని, మొదటి రెండు చెకప్ లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారితో,మూడు నాలుగు చెకప్ లు గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ లో స్త్రీ వైద్య నిపుణులచే పరీక్షలు చేయించుకోవాలని,అవసరమైతే స్కానింగ్ కూడా తీయబడునని, గర్భిణీ స్త్రీలను తీసుకువెళ్లడానికి 102 వాహనాన్ని ఉపయోగించుకోవాలని, సాధారణ ప్రసవాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చేయాలని, సిజేరియన్ ఆపరేషన్లు తగ్గించాలని, మొదటి కాన్పుకు, రెండవ కాన్పుకు మధ్యన ఎడమ ఉండడానికి తాత్కాలిక పద్ధతుల గూర్చి అవగాహన కల్పించాలని, ఇద్దరు పిల్లలైనా ఆడైనా, మగైనా కుటుంబ నియంత్రణ పద్ధతులైన, మగవారికి కోత కుట్టు లేని ఆపరేషన్ అయినా ( నొస్కాల్ పేల్ ) వ్యాసెక్టమీ ఆపరేషన్ గూర్చి, మరియు స్త్రీలకు ట్యూబక్టమ్ ఆపరేషన్ గూర్చి ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. విస్తృత వ్యాధి నిరోధక టీకాలు పుట్టిన దగ్గర్నుంచి ఐదు సంవత్సరాలు పిల్లలందరికీ వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని, టీకాలు 100శాతం అయ్యేవిధంగా కృషి చేయాలని,రక్తహీనత గుర్తించి ఐరన్ పోలిక్ యాసిడ్ టాబ్లెట్లు ఇవ్వాలని కోరడం జరిగింది.అసంక్రమిత వ్యాధులైన బీపీ షుగర్, క్యాన్సర్ స్క్రీనింగ్ 30 సంవత్సరాల పైబడిన వారందరినీ పరీక్షించాలని,మందులు సరిగా వాడాలని , ప్రైవేట్ లో వాడుతున్న వారందరినీ,గవర్నమెంట్ హాస్పిటల్ కు వచ్చే విధంగా అవగాహన కల్పించాలని, ప్రతి ఒక్కరూ కూడా అభ కార్డు ఆన్లైన్ క్రియేట్ చేసుకోవాలని పేర్కొన్నారు.క్షయ వ్యాధి గురించి సమీక్షిస్తూ రెండు వారాల మించి దగ్గు ఉన్నచో తెమడ పరీక్ష చేయించుకోవాలని,క్షయ వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలలో మందులు వాడినచో క్షయ వ్యాధి నయమవునని అవగాహన కల్పించాలి. కీటక జనత వ్యాధులైన మలేరియా,డెంగ్యూ,చికెన్ గునియా, ఫైలేరియా వ్యాధులు రాకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,ఫ్రైడే డ్రై డే నిర్వహించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమములో డాక్టర్ సుధీర్ రెడ్డి , డాక్టర్ సారంగం, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ శ్రవణ్ కుమార్,డిప్యూటీ డెమో కే.ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ కె.వి.రాజు, పురుషోత్తం,సబ్ యూనిట్ ఆఫీసర్స్ రామకృష్ణ, వడ్డెబోయిన శ్రీనివాస్,ఐ సి డి పి హెచ్ ఎన్ ఓ మంగమ్మ, డిపిఓ రుక్మద్దీన్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నెక్కొండ ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ క్యాంపు




**తొలిఅక్షరం/నెక్కొండ, నవంబర్ 4:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో మై భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల నెక్కొండ ఎన్ ఎస్ ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో స్థానిక నెక్కొండ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఆలయంలో ఉన్నటువంటి పిచ్చి మొక్కలను మరియు పరిసరాలను శుభ్రం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి ఇ, కరుణశ్రీ ఎన్ ఎస్ పి ఓ డాక్టర్ వి,ప్రభాకర్ మరియు అధ్యాపకులు ఉమారాణి, అశోక్, ఆనందం, భీమేందర్,సంపత్, శ్రీలత,కీర్తి అధ్యాపకేతర బృందం తదితరులు పాల్గొన్నారు. ఇట్టి కార్యక్రమం లో దేవస్థాన గ్రామ కమిటీ వారు భాగస్వాములు కావడం జరిగింది.

## నెక్కొండ నందు భవాని కాటన్ ఇండస్ట్రీస్‌లో కొనుగోలు సిసిఐ కేంద్రం ప్రారంభం



**తొలిఅక్షరం/నెక్కొండ, నవంబర్ 4:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ నెక్కొండ నందు భవాని కాటన్ ఇండస్ట్రీస్ లో దొంతి మాధవరెడ్డి రెడ్డిశాసనసభ్యులు నర్సంపేట చే సీసీఐ సెంటర్ ప్రాంభించడం జరిగినది.ఇట్టి కార్యక్రమంలో చైర్మన్ రావుల హరీష్ రెడ్డి,ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఉప్పాల శ్రీనివాస్ , ప్రాంతీయ ఉప సంచాలకులు పద్మావతి, మరియు జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, మరియు మార్కెట్ కమిటీ సభ్యులు రైతు సోదరులు, సిపిఓ సుషీల్, ఎమ్మార్వో రాజకుమార్ , ఎంపీడీవో ప్రవీణ్ , నెక్కొండ ఎస్సై మహేందర్ , మాజి చైర్మన్ సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి , నెక్కొండ గ్రామ ప్రజలు మార్కెట్ సిబ్బంది ,జిన్నింగ్ మిల్ యాజమాన్యం వారు, ఇతరులు పాల్గొనడం జరిగింది. కార్యదర్శివ్యవసాయ మార్కెట్ కమిటీ,నెక్కొండ.

## నవంబర్ 6న జాబ్ మేళా: జిల్లా ఉపాధి అధికారి

**తొలిఅక్షరం/పెద్దపల్లి:** పెద్దపల్లి జిల్లాలోని నిరుద్యోగ యువకులకు హైదరాబాద్ లోని కేఎల్ టెక్నికల్ సర్వీసెస్ లో ఉద్యోగాలు కల్పించుటకు ఈనెల 6న బుధవారం రోజున పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్లో రూమ్ నెంబర్ 225 నందు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతి రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.కేఎల్ టెక్నికల్ సర్వీసెస్ హైదరాబాద్ లో 50 వేర్ హౌస్ అసిస్టెంట్,ఇతర పోస్ట్ లు ఖాళీలు ఉన్నాయని, పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని,వీరి వయస్సు 18 నుంచి 25 ఏళ్లు లోపు ఉండాలని తెలిపారు.ఈ కంపెనీలో చేరిన వారికి వేతనం నెలకు 16 వేలు ఉంటుందని, ఆసక్తి ఉన్నవారు.నవంబర్ 6నన ఉదయం 11 గంటల సర్టిఫికేట్స్ జిరాక్స్ లతో సమీకృత జిల్లా కలెక్టరేట్కు వచ్చి తమ పేరు నమెదు చేసుకోవాలని,మరిన్ని వివరాలకు 7093172221 8985336947,8121262441 నందు సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు ఆ ప్రకటనలో తెలిపారు.

## మాజీ ఎంఎల్ఏ పరమార్శ..

**తొలిఅక్షరం/గోదావరిఖని:** గోదావరిఖని తిలక్ నగర్ కి చెందిన సాయి నితిన్, అతని మిత్రుడు సిరిపురం వంశీ 24-11-24రోజున ద్విచక్ర వాహనం పై ప్రయాణిస్తూ మాతంగి కాలనీ రోడ్ లో ప్రమాదానికి గురి అయ్యారు . వంశీ అక్కడికి అక్కడ నే మృతి చెందగా, తీవ్రంగా గాయపడ్డ సాయినితీష్ సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ పంపారు చికిత్స పొందుతూ సాయి నితీష్ బ్రెయిన్ డెడ్ అయ్యాడు. వారి కుటుంబ సభ్యులు జీవన దాస్ ట్రస్టు ద్వారా అవయవ దానం చేశారు. సాయి నితీష్ పార్థివదేవానికి హాస్పిటల్స్ సిబ్బంది గౌరవ వందనం చేశారు, వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పరమర్శించారు. వారితోపాటు నాయకులు జేవి రాజు, ఇనుముల సత్యం, నీరటి శ్రీనివాస్, కోడి రామకృష్ణ శ్రీధర్ బండారి శ్రీనివాస్ శ్యాం రమేష్ హరికృష్ణ పాల్గొన్నారు.



